ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
శుక్రవారం 2 ఆగస్టు 2024


మున్నంగి నుంచి ఐదు కిలోమీటర్ల మేర కరకట్టపై ఇసుక కోసం బారులుతీరిన లారీలు

ఇసుక సీరియల్.. చీటీ రూ. 2500

డబ్బు, మద్యం సీసా ఇస్తారా! అయితే మీకు వెంటనే ఇసుక లోడ్ అయిపోతుంది. ఇవేమీ ఇచ్చుకోలేమంటారా!... మూడు నుంచి నాలుగు రోజులు కరకట్టపై పడిగాపులు పడాల్సిందే. ప్రభుత్వం ఇస్తున్నది ఉచిత ఇసుకే కదా! ఇట్టే లోడ్ చేయించుకుని ఇంటికి పట్టుకెళ్లిపోవచ్చని లారీ తీసుకుని వెళితే మీకు చుక్కలు కనిపించాల్సిందే. దళారులు, సిబ్బంది కుమ్మక్కయి ఉచిత ఇసుక నుంచి తైలం పిండేస్తున్నారు. ఇసుక రీచ్‌లన్నీ లేకపోవటం, ఇసుక గుట్టలకే అనుమతి ఇవ్వటంతో, అవి ఉన్న నాలుగైదు చోట్ల దళారులు, సిబ్బంది కలసి వినియోగదారులను నిలువునా దోచేస్తున్నారు. ప్రభుత్వం నిర్మాణదారులకు ఇసుకను ఉచితంగా ఇద్దామని ప్రతిష్ఠాత్మక నిర్ణయం తీసుకుని, కేవలం లోడింగ్ ఖర్చులు మాత్రమే చెల్లించి ఇసుక తీసుకువెళ్లొచ్చని ప్రకటిస్తే, చివరకు ఇసుక కొన్నంత రేటుకు రెట్టింపు వసూళ్లతో వినియోగదారుడికి 'ఉచిత' ఇసుక గుప్పెడు కూడా దొరకనివ్వటంలేదు. ప్రభుత్వం చెప్పిన పద్ధతి ప్రకారం ఇసుక కోసం వెళ్లి ఒక లారీ ఇసుక తెచ్చుకోవాలంటే కనీసం మూడు నుంచి ఐదు రోజులు కరకట్టపై పడిగాపులు పడాల్సిన దయనీయ పరిస్థితి.

తెనాలి, ఆగస్టు 1, (ఆంధ్రజ్యోతి): ఒక లారీ ఇసుక కావాలంటే ప్రభుత్వం రూ. 2,500 చెల్లించాలని కూలి రేటు నిర్ణయిస్తే, అంతే మొత్తం సిబ్బందికి సమర్పించుకుంటే కానీ ఇసుక లోడ్ కాని పరిస్థితి. ట్రాక్టర్‌కు మినహా 6 చక్రాల లారీకి సీరియల్ నంబర్ వెంటనే కావాలంటే రూ. 1500, పది చక్రాల లారీకి సీరియల్ స్లిప్ కావాలంటే రూ. 2,500 చెల్లించాల్సిందే. లేకుంటే లారీ లోపలికి దిగదు. కొల్లిపర మండలం మున్నంగిలో ఇదేతరహా బరితెగింపు రాజ్యమేలుతోంది. అదేమని అడిగితే పాత సీరియల్ ఇంకా కాలేదంటూ వరుసలో ఉన్న లారీలను వరుసలోనే నిలబెట్టి వారికి డబ్బిచ్చిన లారీలను ఒక్క గంటకూడా నిలవనివ్వకుండా ఒక్క రోజులోనే ఒకటి నుంచి మూడు లోడుల ఇసుక ఇప్పించేస్తున్న పరిస్థితి. గురువారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కొల్లిపర మండలం వస్తుండటంతో ఎక్కడ ఇసుక రీచ్‌కు వస్తారో! ఏ తనిఖీలు చేసి ఎక్కడ చర్యలకు దిగుతారోనన్న భయంతో మధ్యాహ్నం 12 గంటలలోపే 90 లారీలకు లోడ్ చేసి పంపేయటం విశేషం. ఆదివారం నుంచి ఇసుక కోసం పడిగాపులు కాస్తున్నవారికి ఉపశమనం లభించిందంటే, కచ్చితంగా ఇసుక సీరియల్ నంబర్‌ల ప్రకారం రోజూ లోపలికి అనుమతిస్తే రోజుల తరబడి లారీలు నిలిచి ఉండాల్సిన పని ఉండదు. లోపల ఏం జరుగుతుందనేది బహిరంగ రహస్యమే అయినా, లోపం మాత్రం సరిచేసేవారు కరువయ్యారు. దీంతో ప్రభుత్వం ఉచితంగా వినియోగదారునికి ఇసుక ఇద్దామన్నా మధ్య దళారులు దానిని ఆచరణలో అమలు కానివ్వకుండా అప్రతిష్ఠతెచ్చే ప్రయత్నాలు బహిరంగంగానే చేస్తున్నారు.

ప్రభుత్వ నిర్ణయం ఘనం... ఆచరణే ఆమ్యామ్యాల మయం

ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేస్తున్నట్టు ఆదేశాలిచ్చాక ముందుగా గత ప్రభుత్వ కాలంలో అక్రమంగా ఒడ్డున నిల్వ ఉంచిన భారీ ఇసుక గుట్టలను ఇచ్చేందుకు అనుమతులిచ్చారు. ప్రకాశం బ్యారేజి దిగువన మున్నంగి, కొల్లిపరలోనే అవకాశం ఉంటే, ఎగువన మాత్రం లింగాయపాలెం, తాళ్లాయపాలెం, వైకుంఠపురం దగ్గర ఇసుక గుట్టలకు అనుమతి ఇచ్చారు. దీనికోసం రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, ఎంపీడీఓ, సచివాలయ సిబ్బందిని ఒక్కో చోట 20 మందికిపైగా సిబ్బందిని ఏర్పాటుచేసి మరీ వినియోగదారునికి అసౌకర్యం కలగకుండా ఇచ్చేందుకు ప్రభుత్వం పగడ్బందీ ఏర్పాట్లే చేసింది. ఇసుక లోడ్ కూడా గత ప్రభుత్వ కాలంలో ఓవర్ లోడ్‌లా కాకుండా, ట్రాక్టర్‌కు 5 టన్నులు, ఆరు చక్రాల లారీలకు 10 టన్నులు, పది చక్రాల లారీలకు 20 టన్నుల ఇసుక లోడ్‌కు అనుమతినిచ్చారు. అయితే ఒక్కో రీచ్ దగ్గర లారీలు బారులు తీరితే ఏ రోజుకారోజు నిలిపి ఉన్న లారీల దగ్గరకే అధికారులు వెళ్లి సీరియల్ నంబర్ వేసి ఇవ్వటం, దాని ప్రకారమే లోనికి అనుమతించి, లోడింగ్ చార్జీల చెల్లింపులు చేయించటం ఒక క్రమ పద్ధతిలోనే జరిగిపోయాయి. అయితే వీటిలో రీచ్‌లున్న ప్రాంతాల్లో స్థానిక నేతలకు ఒత్తిడులు రావటంతో కొన్ని లారీలకు సీరియల్‌తో పనిలేకుండా ప్రయారిటీ పేరుతో ఎప్పుడు లారీ వచ్చినా వరుసలో ఆగకుండా నేరుగా లోడింగ్‌కు వెళ్లేలా సిఫార్సులు చేయించారు. ఈ అవకాశం వచ్చిందోలేదో వెంటనే దళారులు పుట్టుకొచ్చేశారు. వారు సిబ్బందితో కుమ్మక్కయిపోయి నాయకుల పేర్లు చెప్పి చీటీల అమ్మకానికి బరితెగించేశారు. నేతలు చెప్పిన లారీలు పదుల సంఖ్యలో ఉంటే, వీరు మాత్రం వందల సంఖ్యలో అక్రమ పద్ధతిలో లారీలకు అదనపు వసూళ్లు చేసి మరీ ఇసుక ఇప్పించేస్తున్నారు.

- ఇసుక సీరియల్ నంబర్లు నల్లబజార్‌లో
- లోడింగ్ దగ్గర దళారులు, సిబ్బందిదే రాజ్యం
- డబ్బు, మద్యానికి సీరియల్ చీటీల అమ్మకం
- అధికారులు, విలేకరులకు వాటాలివ్వాలట...
- అధికార పార్టీ నాయకుల పేరు చెప్పి సిబ్బందే బరితెగింపు
- ఒక్కో చీటీ రూ. 1500 నుంచి రూ. 2,500
- డబ్బిస్తే వెంటనే లోడింగ్... మందు బాటిలిస్తే అదే రోజు ఇంకో లోడ్
- లేకుంటే నాలుగు రోజులకో లోడ్
- మున్నంగిలో బరితెగింపు...

నేతలు.. అధికారులు.. విలేకరులకు వాటాలని చెప్పి..

సీరియల్ తప్పించి వారికిష్టమొచ్చిన లారీలకు ఒకటికి మించి ఇసుక లోడ్‌కు అవకాశం కల్పిస్తూ ఒక్కో ట్రిప్‌కు రూ. 2,500 వసూలు చేస్తున్నారు. అంటే ఒకలారీ ఆ రోజులో మూడు ట్రిప్‌లు వేసిందనుకుంటే ఆ లారీనుంచే రూ. 7,500 వసూలు చేస్తున్నట్టు. ఇట్లా రోజుకు 60 నుంచి 80 లారీల వరకు అవకాశం ఇస్తున్నారు. అంటే ఎంత భారీ మొత్తంలో దళారులు, సిబ్బంది కలసి చేతివాటం చూపించి నేతల పేర్లు ఉపయోగించుకుని దోచేస్తున్నారనేది అర్థమవుతుంది. పోనీ లోడింగ్ పెద్దగా కావటంలేదా! అంటే అదీలేదు. రోజుకు 200 నుంచి 280 వరకు లారీలకు లోడ్ చేసేస్తున్నారు. మున్నంగి-వల్లభాపురం మధ్య అటు, ఇటు ఐదు నుంచి ఆరు కిలోమీటర్లమేర లారీలు కరకట్టకు ఇరువైపులా ఆగిపోయి ఉంటున్నాయి. దీనికి తోడు కట్టకు అంచున నిలువుగా నిలపకుండా సీరియల్ తప్పించేసి ఎప్పుడు కావాలంటే అప్పుడు గుట్టల దగ్గరకు వెళ్లే లారీలు ముందుభాగం కరకట్టపైకి ఉండేలా పెడుతుండటంతో కరకట్ట సగంపైగా ఆక్రమించేస్తున్నాయి. ఇదే పరిస్థితి రెండుపక్కల ఉండటంతో రేపల్లె-విజయవాడ బస్సు వెళ్లటానికి, చివరకు కార్లు వెళ్లటానికి కూడా గంటకొద్దీ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. అయితే బిల్లుల దగ్గర ఇద్దరు, ముగ్గురు పోలీస్ సిబ్బంది ఉంటున్నా వారిలో ఒకరిద్దరు పోలీసులు మాత్రం దొంగ స్లిప్‌లు ఎవరు తీసుకుంటున్నారో చూసుకుని, వారిదగ్గర నుంచి వాటాలు రాబట్టుకునే పనికే ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శ ఉంది. వీరు కనీసం లారీలు అడ్డదిడ్డంగా పెడుతున్నా వాటిని వారించకుండా, క్రమ పద్ధతిలో పెట్టించకుండా వదిలేస్తుండటంతో సమస్య మరింత జఠిలమవుతోంది. నేరుగా లారీలు తీసుకవెళ్లిన వినియోదగారులే అదంతా చూడలేక అదేమని ప్రశ్నిస్తే ఈ మొత్తం వాటాలు మాకొక్కరికే కాదని, ఒక్కో స్లిప్‌కు వచ్చిన డబ్బు నేతలకు, మాపై అధికారులకు, చివరకు విలేకరులకు కూడా ఇవ్వాల్సిందేనని, మొత్తం మేము తినటంలేదని బహిరంగంగానే చెప్పటం వీరి బరితెగింపునకు నిదర్శనం.

సీరియల్ చీటీలు... డబ్బు, మద్యానికి అమ్మకం

ఒక ట్రాక్టర్ ఇసుకకు మున్నంగి వంటి రీచ్‌లలో టన్నుకు రూ. 250 చొప్పున ప్రభుత్వం నిర్ణయించిన కూలి రేట్ల ప్రకారం రూ. 1250 చెల్లించాలి. 6 చక్రాల లారీలకు రూ. 2,500 చెల్లించాలి. 10 చక్రాల లారీలకు రూ. 5వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ రేట్ల ప్రకారం వినియోగదారుడు చెల్లిస్తే ఇసుక తీసుకువెళ్లొచ్చు. అయితే ఇక్కడ దీనిప్రకారం జరగటంలేదు. ఇక్కడ దళారులదే ఇష్టారాజ్యం. సిబ్బందికీ వాటాలు అందుతుండటంతో వారు చెప్పినవారికి స్లిప్‌లు ఇచ్చేస్తున్నారు. ఇసుక అనుమతిచ్చిన మొదట్లో ఆగిన లారీల దగ్గరకే సిబ్బంది వెళ్లి సీరియల్ నంబర్‌తోపాటు బిల్‌కూడా ఇచ్చేసేవారు. ఆ సీరియల్ ప్రకారం లారీలను పోలీసులు లోపలకు అనుమతిస్తే, లోపలకు వెళ్లాక ఆన్‌లైన్ విధానంలో డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. ఆ డబ్బు కట్టేశాక లోడింగ్ దగ్గర ఇసుక లారీలకు నింపుతారు. అయితే ఇసుక కొరత, డిమాండ్ ఎక్కువ కావటంతో దళారులు, సిబ్బంది కుమ్మక్కయి ఇసుక స్లిప్‌లను అమ్మేస్తున్నారు. లారీల దగ్గరకు వెళ్లకుండా ముందుగానే దళారులకు ఒక్కొక్కరికి పది నుంచి 20 స్లిప్‌లు సీరియల్ నంబర్ వేసి ఇచ్చేయటం పరిపాటిగా మారిపోయింది. మరో విశేషమేమంటే ఆ సీరియల్ నంబర్ ఉన్న స్లిప్ తీసుకునేవారికి అసలు లారీకూడా వెంట ఉండకపోవటమే. ఒక్కమాటలో చెప్పాలంటే వీరికి ఇసుకే అవసరం ఉండదు. కేవలం నల్లబజార్‌లో స్లిప్‌లను అమ్మేందుకు వారు సిద్ధమవుతున్నారు.

ఉచితంగా అందాల్సిన ఇసుకకు..

ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం తీసుకొస్తే, నామమాత్రపు కూలి రేట్లు మినహా రీచ్ దగ్గర పెద్దగా ఖర్చు పెట్టాల్సిన పనిలేదు. కానీ ఇక్కడ జరుగుతున్న లోపాలతో ఉచితం మాట అటుంచితే, అసలు చెల్లించాల్సిన చార్జీలకంటే మూడు నుంచి ఐదు రెట్లు అదనంగా చెల్లించుకోవలసిన దయనీయ పరిస్థితి. ఉదాహరణకు తెనాలికి చెందిన ఒకరు, నారాకోడూరు, సంగంజాగర్లమూడికి చెందిన మరో ఇద్దరు మూడు లారీలు తీసుకుని ఇసుక కోసం ఆదివారం మున్నంగి రీచ్‌కు వెళితే, వారికి 74,78,79 సీరియల్ నంబర్‌లిచ్చారు. ఆ రోజు లోడ్ కాకపోవటంతో సోమవారం తమ సీరియల్ వచ్చిందేమో అని చూసుకుంటే ఇంకా 22వ సీరియల్ నడుస్తున్నట్టు చూపించారు. వారికి అనుమానం వచ్చి సోమవారం మొత్తం లోడయిన వాహనాలను లెక్కిస్తే లారీలు, ట్రాక్టర్లు మొత్తం 256 ఉన్నట్టు తేలింది. అయితే తర్వాత రోజు కూడా తమ సీరియల్ కాకపోవటం, మూడో రోజు ఏకంగా 112 నంబర్ కనిపించటంతో అదేమని అడిగితే మీకన్నా ముందు ఇచ్చిన సీరియల్ ఇంకా కాలేదని సిబ్బంది బుకాయించటం కొసమెరుపు. నాలుగు రోజులు గడిచినా వారి లారీలకు సీరియల్ మాత్రం అందలేదు. దీంతో రోజుకు డ్రైవర్‌కు రూ. వెయ్యి చొప్పున ఒక్కో లారీకి రూ. 4వేలు చెల్లించుకున్నారు. గురువారం ఎట్టకేలకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్ పర్యటన పుణ్యమాఅని వారికి ఐదో రోజు లోడ్ లభించింది. లోడ్ కోసం రూ. 5వేలు చెల్లిస్తే, డ్రైవర్ ఖర్చులు, కొనుగోలు కలిపి లారీకి రూ. 9 వేల ఖర్చు. ఇదికాక రవాణా చార్జీలు కూడా కలిపితే వారి ఇంటికి లారీ ఇసుక చేరటానికి రూ. 12వేలపైనే ఖర్చయింది. అంటే గతంలో ఇసుక కొనుగోలు సమయంలో చేసినంత ఖర్చే ఇప్పుడు చెయ్యాల్సిన పరిస్థితి. పోనీ ఇవన్నీ కాకుండా నల్ల బజార్‌లోనే చీటీలు కొనుక్కుని ఇసుక తీసుకువెళ్లినా లారీ ఇసుక రూ. 5వేలు, సీరియల్ చీటీ ఖరీదు రూ. 2,500, రవాణా చార్జీలు కలిపి రూ. 10,500పైనే వినియోగదారునికి పడుతోంది. ఇంత భారం పడటానికి కారణం ఏమంటే లోపమంతా దళారులు, సిబ్బంది దగ్గరే. దీనిని పర్యవేక్షించాల్సిన అధికారులుకూడా పట్టించుకోకపోవటం, ఎవరైనా ప్రశ్నిస్తే, నేతల పేరుచెప్పి వారి సిఫార్సుల వల్ల తప్పటంలేదని సిబ్బంది తప్పించుకుంటున్న పరిస్థితులూ ఉన్నాయి.

మంత్రి మనోహర్ వస్తున్నారని..

వారం నుంచి ఇసుక లోడ్ కాకుండా ఉన్న లారీలు, కిలోమీటర్ల పొడవున నిలిచిన లారీలకు గురువారం మధ్యాహ్నం లోపే ఇసుక లోడింగ్ జరిగిపోయింది. ఎవరినీ బ్రతిమాలకుండా, సీరియల్ కోసం బారులుతీరి నిలబడాల్సిన పనిలేకుండా అంతా మాయ జరిగినట్టు జరిగిపోయింది. రోజులతరబడి నిరీక్షించినవారికి ఏం జరుగుతుందో! సిబ్బందిలో ఇంత చిత్తశుద్ధి ఎందుకు వచ్చిందో చాలా సేపు అర్థంకాలేదు. తీరా ఏంటాఅని ఆరాతీస్తే రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పెన్షన్‌ల పంపిణీ కోసం కొల్లిపర మండలంలో పర్యటించనుండటమేనని తెలిసి ఇసుక వినియోగదారులు సంతోషపడిపోయారు. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటలలోపే 90 లారీలకు లోడింగ్ అయిపోయిందంటే, అదికూడా సీరియల్ ప్రకారం జరిగిందంటే ఆశ్చర్యమే. అంటే అంతా సక్రమంగా జరిగితే ఒక్క లారీ కూడా ఒక పూటకు మించి నిరీక్షించాల్సిన పనిలేదన్నమాట. మనోహర్ గతంలో కొల్లిపర ఇసుక గుట్టల దగ్గర ఆకస్మిక తనిఖీలు చేసి లోపాలపై అధికారులపై మండిపడటం, మరోసారి జరిగితే ఉపేక్షించమని, చర్యలు తప్పవని హెచ్చరించిన విషయం తెలిసిందే. అయితే గురువారం కూడా ఆయన కొల్లిపర వచ్చిన సందర్భంలో ఆకస్మికంగా తనిఖీ చేస్తారేమోనని సిబ్బందే బిల్లుల పాకల దగ్గర కూర్చోకుండా లారీల దగ్గరకే వచ్చి సీరియల్ నంబర్ ఇవ్వటం, ఇచ్చిన లారీల ఫోటోలు బిల్లింగ్ సిబ్బందికి పెట్టటం వంటివి చేసేశారు. అటు పోలీసులు కూడా అన్నీ సక్రమమైన పద్ధతిలో తీసుకొచ్చారు. అంటే లోపం లోడింగ్‌లో కాదని, సిబ్బంది, దళారుల పాత్రపైనే ఆధారపడిఉందనేది దీనిద్వారా అర్థమవుతున్న విషయమే. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ దళారుల దోపిడీకి అడ్డుకట్ట వేస్తారో! లేదో చూడాలి.


సీరియల్ నంబర్ వేసి, బిల్ ఇచ్చే క్యాబిన్ వద్ద ఒకవైపు వరుసలో బిల్‌కోసం బారులు తీరితే, మరో కిటికీ దగ్గర దళారులిచ్చిన స్లిప్‌లకు బిల్లులు తీసుకునేందుకు గుమికూడిన చిత్రం

మున్నంగిలోనే ఎందుకు కట్టడి కావటం లేదో! నేతలకే ఎరుక. గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని లారీలే కాకుండా ఇక్కడికి కృష్ణా జిల్లా లారీలు భారీగానే వచ్చి చేరుతున్నాయి. కృష్ణా జిల్లాలో కీసర దగ్గర ఇసుక ఉన్నా, వారికి మున్నంగి దగ్గర కావటంతో వచ్చేస్తున్నారు. దీంతో స్థానికంగా ఉండే లారీలకు 50 మందికి స్లిప్‌లు ఇస్తుంటే, అటు కృష్ణా జిల్లా లారీలకూ మరో 50 ఇస్తున్నారు. దీంతో రద్దీ కూడా పెరిగిపోతోంది. గతంలో సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్ రీచ్ దగ్గర పరిశీలించినప్పుడు స్థానిక లారీల యజమానులు కృష్ణా జిల్లా లారీల విషయం చెప్పటంతో వాటిని ప్రోత్సహించవద్దని ఆదేశాలిచ్చారు కూడా. అయితే అటు నుంచి వచ్చిన లారీలు స్థానిక లారీల కంటే మరో రూ. 500 అదనంగా ఇస్తుండటంతో దళారులు, సిబ్బంది వారి కి అవకాశం ఇస్తున్నారు. పైగా వారు కృష్ణా జిల్లా నుంచి కాకుండా గుంటూరు జిల్లా నుంచే వచ్చామని చెప్పించిమరీ ఇసుక తీసుకెళుతున్నారు. దీంతో రద్దీ మరింత పెరిగిపోతోంది.

ఇదే పరిస్థితి గతంలో వైకుంఠపురం రీచ్ దగ్గర ఉంటే దానిని చాలావరకు సరిచేశారు. తాజాగా పెదకూరపాడు ఎమ్మెల్యేనే రంగంలోకి దిగి, ఇసుక విషయంలో ఎవరైనా దళారులు ఉంటే అరెస్ట్ చేయాలని పోలీసులను ఆదేశించిన పరిస్థితి ఉంది. దీంతో చాలావరకు ఇక్కడ రచ్చ సర్దుమణిగింది. అటు లింగాయపాలెంలోనూ వైసీపీ పాత నేతలు, ఎంపీ అనుచరులు మొదటి పది రోజుల్లో అడ్డదారుల్లో ఇసుక తరలించే ప్రయత్నం చేసినా, ప్రస్తుతం అక్కడ కూడా అంతా పగడ్బందీగానే సాగుతోందనేది లారీల యజమానులు, నిర్మాణదారుల మాట.


మంత్రి మనోహర్ వస్తుండటంతో బండిపైనే కూర్చుని సీరియల్ నంబర్, బిల్లులు ఇస్తున్న చిత్రం


కరకట్టపై అడ్డదిడ్డంగా పెట్టిన నేతలు, అధికారుల సిఫార్సులున్న వారి లారీలు


నదిలో కనుచూపు మేరలో ఇసుక లేకుండా తవ్వేసినా, గాలు మార్గంలో బారులను తలపిస్తున్న ట్రాక్టర్‌లు

ఎట్టకేలకు తహసీల్దార్లకు పోస్టింగ్‌లు

- 22 మండలాలకు నియామకం
- 6 మండలాలు ఖాళీ

నరసరావుపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లాలో తహసీల్దార్లకు ఎట్టకేలకు పోస్టింగ్‌లు లభించాయి. కలెక్టర్ అరుణ్‌బాబు గురువారం రాత్రి నియామకాలకు సంబంధించిన ఉత్తర్వులు విడుదల చేశారు. వెయిటింగ్‌లో తహసీల్దార్లు అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనం నేపథ్యంలో తహసీల్దార్ల నియామాకం జరిగింది. వీరి నియామకంలో సిఫార్సుల లేఖలకే ప్రాధాన్యం ఇచ్చినట్టు ప్రచారం. ఇతర జిల్లాల్లో విధులు నిర్వహిస్తూ అక్కడ రిలీవై జిల్లాకు వచ్చిన వారికి మండలాలను కేటాయించారు. జిల్లాలో 28 మండలాలు ఉండగా 22 మండలాలకు నియమాకం చేశారు. నరసరావుపేట, రొంపిచర్ల, ఈపూరు, శావల్యాపురం, బొల్లాపల్లి, వెల్దుర్తి మండలాలకు తహసీల్దార్లను ఇంకా నియమించలేదు.

తహసీల్దార్ పేరు	మండలం
మహ్మద్ జియా	మాచర్ల
కె వేణు గోపాల్	దుర్గి
జీవీఆర్‌సీహెచ్ ప్రసాదు	కారంపూడి
జీ కరుణ కుమార్	రెంటచింతల
ఎం డానియేలు	పెదకూరపాడు
అషరున్నీషా బేగం	బెల్లంకొండ
జీ శ్రీనివాస్	అచ్చంపేట
జీ సుజాత	క్రోసూరు
ఎన్ నాగమల్లేశ్వరరావు	అమరావతి
కేఎస్ చక్రవర్తి	సత్తెనపల్లి
షేక్ మొహమ్మద్ హుస్సేన్	ముప్పాళ్ల
కె పుల్లారావు	నకరికల్లు
ఎన్ దుర్గేశ్వరరావు	రాజుపాలెం
ఏవీ సుధాకర్	మాచవరం
కె నగేష్	గురజాల
జె మధుబాబు	పిడుగురాళ్ల
వైవీబీ కుటుంబరావు	దాచేపల్లి
ఎస్‌సురేష్	వినుకొండ
జీ రమేష్ కుమార్	నూజెండ్ల
ఎం భవాని శంకర్	చిలకలూరిపేట
జీ విజయశ్రీ	నాదెండ్ల
ఎవీ రమణ	యడ్లపాడు
ఎస్ శివ నాగిరెడ్డి	సూపరింటెండెంట్ కలెక్టరేట్
బి కిరణ్‌కుమార్	సూపరింటెండెంట్ కలెక్టరేట్
ఎంకె రాణి	సూపరింటెండెంట్ కలెక్టరేట్
ఆర్ యశోద	సూపరింటెండెంట్ కలెక్టరేట్
టీ మస్తాన్	డీఏవో ఆర్డీవో కార్యాలయం,నరసరావుపేట
ఏవీపీ చంద్రారెడి	డీఏవో సత్తెనపల్లి ఆర్డీవో కార్యాలయం

జిల్లా పింఛన్ల పంపిణీ 97.75%


పిడుగురాళ్లలో పింఛన్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు


మాచర్లలో బ్రహ్మారెడ్డి


మూలకలూరులో అరవిందబాబు


చిలకలూరిపేటలో పుల్లారావు

పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యేలు

నరసరావుపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అంతటా పింఛన్‌ల పంపిణీ గురువారం ఉదయం 6 గంటల కల్లా ప్రారంభమైంది. ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు. సాయంత్రం కల్లా జిల్లాలో 97.75 శాతం పింఛన్‌లను పంపిణీ చేసి రికార్డు సృష్టించారు. జిల్లాలో 2,78,219 మంది పింఛన్ దారులు ఉండగా సాయంత్రం ఆరు గంటలకు 2,64,602 మందికి పింఛన్ పంపిణీ చేశారు. పింఛన్‌దారులకు రూ 116.03 కోట్లు నగదు పంపిణీ చేశారు. మిగతా పింఛన్‌లను శుక్రవారం పంపిణీ చేయనున్నారు. ఇంటి వద్దనే పింఛన్ ఇస్తామని చెప్పిన సీఎం చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారని అవ్వాతాతలు అయనను ప్రశంసించారు. ఎమ్మెల్యేలు వారి వారి నియోజకవర్గాల్లో పింఛన్ పంపిణీ చేశారు. వలంటీర్లు లేకుండా పింఛన్ ఇంటింటికి పంపిణీ సాధ్యమేనని మరో సారి నిరూపించారు.

నరసరావుపేట నియోజకవర్గంలోని రొంపిచర్లలో కలెక్టర్ పీ అరుణ్‌బాబు పింఛన్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో సరోజ, డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు నరసరావుపేట మండలంలోని ములకలూరు, రొంపిచర్లలో పింఛన్ పంపిణీని చేశారు. చిలకలూరిపేట మునిసిపాల్టీలోని 11, 12, 19 వార్డుల్లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఇంటింటికి వెళ్లి పింఛన్‌లు పంపిణీ చేశారు. ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన వెను వెటనే పింఛన్ పెంచి అమలు చేసి చూపించిన మనస్సున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడని, అయన సంక్షేమ శకానికి నాంది పలికారని ప్రత్తిపాటి ప్రశంసించారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దాచేపల్లి మండలం పొందుగలలో పింఛన్‌లు పంపిణీ చేశారు. సత్తెనపల్లి పట్టణంలోని 10 వార్డు, నందిగం గ్రామంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారా యణ పింఛన్‌లు లబ్ధిదారులకు అందజేశారు. పెదకూరపాడు మండలం హుస్సేన్ నగరంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్‌తో కలసి పింఛన్‌లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి మాచర్ల పట్టణంలోని 26 వార్డు బొబ్బిలి గడ్డలో లబ్ధి దారులకు పింఛన్‌లు అందజేశారు. వినుకొండ పట్టణంలోని హనుమాన్ నగర్‌లో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పింఛన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు.


వినుకొండలో జీవీ ఆంజనేయులు


సత్తెనపల్లిలో కన్నా లక్ష్మీనారాయణ


హుస్సేన్‌నగరంలో ప్రవీణ్, కొమ్మాలపాటి


రొంపిచర్లలో కలెక్టర్ అరుణ్‌బాబు

ఆహా.. ఒకటో తారీఖు

7లో..

- శాశ్వత, కాంట్రాక్టు ఉద్యోగుల ఖాతాల్లో జమైన జీతాలు
- ఐదేళ్ల తర్వాత ప్రభుత్వ సిబ్బంది కళ్లలో ఆనందం


studio green
BESTEST ENTERTAINMENT
SINGLE SCREENS RS.99/-
@ THE BESTEST PRICE
MULTIPLEXES RS.125/-
ALLU SIRISH'S
బడ్డీ
SAM ANTON
FROM TODAY
NETFLIX


TRISHA PRESENTS
నేడే బ్రహ్మాండమైన విడుదల
శివం భజే..


VIJAYA BHASKAR KRAFT
A VIJAYA BHASKAR FILM
నేడే విడుదల
SREE KAMAL TANVI AKAANKSHA
ఉషాపరిణయం
Love is Beautiful..!
WRITTEN, PRODUCED & DIRECTED BY VIJAYA BHASKAR K


SRI NEELAKANTA MAHADEVA ENTERTAINMENTS LLP
PVR INOX PICTURES RELEASE
నేడే విడుదల
Average Student నాని
IN THEATRES 2 AUGUST


IN CINEMAS AUG 2nd
SVC RELEASE
అలనాటి రామచంద్రుడు
నేడే విడుదల


INFINITI FILM VENTURES
IN THEATRES AUGUST 9TH
VIJAY ANTONY
తుఫాన్
S.D.VIJAY MILTON
KAMAL BOHRA | D. LALITHAA | B.PRADEEP | PANKAJ BOHRA


MAHARSHI KONDLA PRESENTS
SINGLE SCREENS RS 99
MULTIPLEXES RS 112
You Are TRAPPED
VARUN SANDESH
విరాజీ
ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 2 విడుదల
నేడే విడుదల


MEGA BLOCKBUSTER
2ND WEEK
KALANITHI MARAN PRESENTS
DHANUSH
రాయన్
IN CINEMAS NOW



పెరవలిపాలెం గ్రామంలో వృద్ధునికి పెన్షన్ అందిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ప్రజల విశ్వాసాన్ని పొందుతున్నాం

● వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, ఆగస్టు1: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ కూటమి ప్రభుత్వం వారి విశ్వాసాన్ని పొందుతోందని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు తెలిపారు. గురువారం ఆయన పెరవలిపాలెం గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని వికలాంగులు, వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ గ్రామ శ్రేణులు ఏర్పాటు చేసిన వేదిక వద్ద సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆనందబాబు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే విషయంలో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామన్నారు. 2019లో జగన్ రూ.3వేలు పెన్షన్ ఇస్తానని ప్రజలను మోసం చేశాడని విమర్శించారు. చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ పెంచిన పింఛన్లను ప్రతి నెలా మొదటి రోజునే లబ్ధిదారులకు స్వయంగా అందజేస్తున్నాని తెలిపారు. జగన్ పాలనలో జరిగిన అరాచకాలు, దోపిడీలపై విచారణ జరిపి రాష్ట్ర స్థాయిలో చర్యలు తీసుకోవడం జరుగుతోందని, అలాగే ప్రతి గ్రామస్థాయిలోనూ జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి సంబంధిత వ్యక్తులపై కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. పారదర్శకతతో పాలన కొనసాగించేందుకు ప్రజల ఆశయాలకు అనుగుణంగా సంక్షేమాన్ని, అభివృద్ధిని అందిస్తున్నామని తెలిపారు. చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అదే బాటలో నడుస్తున్నారని ఒకే మాట, ఒకే బాటగా ప్రతి విషయాన్ని చర్చించుకుని ముందుకు సాగుతున్నారని కొనియాడారు. జగన్ అనే భూతాన్ని తరిమికొట్టి ఎన్నో ఆశలతో కూటమి ప్రభుత్వానికి స్వాగతం పలికిన ప్రజలకు అంతా మేలు జరుగుతుందని భరోసానిచ్చారు. రాష్ట్రాన్ని పునఃనిర్మించాల్సిన అవసరం ఉందని, ఆ ప్రక్రియలో భాగంగా పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలోను లేని విధంగా 164 సీట్లను కూటమి ప్రభుత్వానికి అందించిన ప్రజలకు కృతజ్ఞతాభావంగా బాధ్యతగా ప్రతి ఒక్కరం వ్యవహరిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ బాపట్ల జిల్లా అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయ బాబు, రాష్ట్ర మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ హనీఫ్, నియోజకవర్గ జనసేన సమన్వయకర్త ఊసా రాజేష్, ఎస్సీ సెల్ నాయకులు దొప్పలపూడి సుధాకర్, మాజీ సర్పంచ్ సాంబశివరావు, కుచ్చెళ్ళపాడు, చావలి సర్పంచ్‌లు గాజుల వెంకట సుబ్బయ్య, విష్ణుమొలకల శ్రీనివాసరావు, బండారు సూరిబాబు, టీడీపీ లీగల్ సెల్ నాయకులు కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆహా.. ఒకటో తారీఖు

● శాశ్వత, కాంట్రాక్టు ఉద్యోగుల ఖాతాల్లో జమైన జీతాలు
● ఐదేళ్ల తర్వాత ప్రభుత్వ సిబ్బంది కళ్ళలో ఆనందం

మొన్నటి వరకు అమ్మో.. ఒకటో తారీఖు అనుకున్న ప్రభుత్వ ఉద్యోగులు.. ఇప్పుడు ఆహా.. ఒకటో తారీఖు అంటున్నారు. ఐదేళ్ళ తర్వాత నెల మొదటి రోజు జీతం అందుకోవడం ఆనందాన్ని కలిగిస్తుందని అంటున్నారు. చంద్రబాబు నాయుడు పుణ్యమాని ఇప్పుడు ఇంటి అద్దె.. కరెంటు బిల్లు..పిల్లలు ఫీజులు.. నిత్యావసరాలకు దిగులుచెందే పనిలేదని చెబుతున్నారు.



గుంటూరుసిటీ, ఆగస్టు 1: ఉమ్మడి గుంటూరుజిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులకు గురువారం ఉదయం 9 గంటల నుంచే జీతాలు పడటం ప్రారంభం అయ్యాయి. మధ్యాహ్నం నుంచి వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా జీతాలు జమ అయ్యాయి.2014 నుండి 2019 వరకు చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో ఇదేవిధంగా నెల 1వ తేదీనే ప్రభుత్వ ఉద్యోగులు జీతాలు అందుకున్నారు. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం ఏ నాడు ఒకటో తారీఖు జీతాలు ఇచ్చిన దాఖలాలు లేవు. ఉపాధ్యాయుల పరిస్థితి అయితే మరీ దారుణం. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తున్నారన్న భావనతో ఉపాధ్యాయులకు ప్రతి నెల 15వ తారీఖు తర్వాత జగన్ ప్రభుత్వం జీతాలువేయటం జరిగింది. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఆ ప్రభుత్వంలో కన్నీళ్లురాలని రోజు లేదు. కాంట్రాక్టు ఉద్యోగులకు నెలాఖరుకు జీతాలు ఇవ్వగా, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆరు నెలలకు ఒకసారి చెల్లిస్తూ వచ్చారు. చిన్నాచితక ఉద్యోగులు సరిగ్గా జీతాలు రాకపోవడంతో అవసరాలు తీర్చుకొనేందుకు వడ్డీ వ్యాపా రులను ఆశ్రయించి అప్పులపాలైన ఘటనలు అనేకం వెలుగు చూశాయి.

రోజులు మారిపోయాయి...

ఎట్టకేలకు ప్రభుత్వం లోని అన్ని స్థాయిలు, విభాగాలకు చెందిన కష్టాలు ఈడేరాయి. ప్రతినెల మొదటి రోజునే జీతాలు చెల్లిస్తామని చంద్రబాబు నాయుడు చెప్పిన మాటలు నెరవేరడం తో నెలవారీ బాధలకు కాలం చెల్లింది.ఆగస్టు నెల ఒకటో తేదీన చేతికి జీతాలు రావటం సంతోషంగా ఉందని రెగ్యులర్, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చెబుతున్నారు. ఇంక నిచ్చింతగా ఉండొచ్చన్న భావన వారిలో వ్యక్తం అవుతోంది.

జిల్లాలో అందరికీ జీతాలు పడ్డాయి
బీ. రాజగోపాలరావు, జిల్లా ఖజానా అధికారి



గుంటూరు జిల్లాలో సుమారు 22 వేల మంది రెగ్యులర్, 11 వేల మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు వున్నారు. దరిదాపుగా అందరికీ జీతాలు జమయ్యాయి. పెన్షనర్లకు కూడా జమ అవుతున్నాయి. ఒకటో తేది ఉదయం నుంచే చెల్లింపులు ఆరంభం అయ్యాయి. సీఎఫ్‌ఎంఎస్ చక్కగా పనిచేస్తుంది. ఏవిధమైన సమస్యలు లేవు. ప్రభుత్వ ఖజానాలో ఫండ్స్ ఉన్నట్లు సీఎఫ్‌ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసిన బిల్లుల ఆధారంగా అర్థం అవుతోంది. ఫండ్స్ వున్నప్పుడు క్లియరెన్స్ చకచక జరుగు తుంది. చాలామంది ఉద్యోగులు నన్ను వ్యక్తిగతంగా కలిసి కృతజ్ఞతలు చెబుతున్నారు. కృతజ్ఞతలు చెప్పాలిసింది నాకు కాదు ప్రభుత్వానికి.


ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఉద్యోగులను మరవలేదు
- మలినేని భానుమూర్తి, తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్



కూటమి ప్రభుత్వం వాస్తవానికి ఎన్నో సవాళ్ళను ఎదుర్కొంటుంది. వాటిటితో పని లేకుండా సీఎం చంద్రబాబు ఉద్యోగుల విషయంలో చాలా ఉదారంగా వ్యవహరిస్తున్నారు. ఎన్నో రోజుల తర్వాత ప్రభుత్వ ఉద్యోగులు నెల మొదటి రోజే జీతాలు తీసుకుంటున్నారు. ఇది ఉద్యోగుల్లో ఎంతో ఆనందం కలిగిస్తుంది. ఇది ఉద్యోగుల అనుకూల ప్రభుత్వం అనటానికి ఇదే నిదర్శనం.

నీటి సరఫరా కొనసాగింపు

అన్నదాలకు తీపి కబురు
రెండు రోజుల్లో అధికారిక ప్రకటన
సాగర్‌కు జలకళ.. 3.69 లక్షల కూసెక్కుల వరద



కుడి కాలువకు నీటి సరఫరా

నరసరావుపేట (ఆంధ్రజ్యోతి) : నాగార్జున సాగర్ జలాశయం జలకళ సంతరించుకుంది. వరదనీరు పోటెత్తుంతోంది. రోజు రోజుకు నీటినిల్వలు గణనీయంగా పెరుగుతున్నాయి. కుడికాలువ ఆయకట్టులో సాగు, తాగునీటి కష్టాలు తీరనున్నాయి. భారీగా వరద వస్తున్న ఈ నేపథ్యంలో ప్రభుత్వం కుడి కాలువకు సాగు నీరు సరఫరా చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం కుడి కాలువకు తాగు నీటి అవసరాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. నీటిసరఫరాను కొనసాగించనున్నట్లు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. సాగునీటి సరఫరాపై రెండురోజుల్లో ప్రభుత్వం అధికారికంగా ప్రకటించనుంది. ఇప్పటికే కేఆర్‌ఎంబీకి జలవనరులశాఖ సాగునీటి సర ఫరా అనుమతికి లేఖపంపింది. సాగునీటి సరఫరాను కొనసాగిస్తుండటంతో అన్నదాతలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

గత ఏడాది సాగు నీరు లేక ఆయకట్టులో పంటలు సాగు కాగ బీళ్లుగా మారడంతో అన్నదాతలు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారు. సాగర్ జలాశయం వారంలో నిండనుండటంతో ఆయకట్టులో వరి సాగు పూర్తి స్థాయిలో కానున్నది. రైతులు వరి విత్తనాలు సిద్ధం చేసుకున్నారు. వరి నారు మళ్ల పోసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఈ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణమ్మ ఉప్పొంగుతోంది. శ్రీశైలం జలాశయంలోకి గురువారం 3,09,600 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శ్రీశైలం గేట్లు తెరచి సాగర్‌కు 4,43,502 కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయంకు 3,69,866 కూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. గత మూడు రోజుల్లో 47.17 టీఎంసీల నీటి నిల్వ పెరిగింది. సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా సాయంత్రంకు 537.40 అడుగులకు చేరింది. 312.50 టీఎంసీలకు గాను 182.95 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది. ఇంకా 129.55 టీఎంసీల నీరు వస్తు సాగర్ నిండుతుంది. కుడి కాలువకు 4,152 కూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. అల్మట్టి, నారాయణపూర్, జూరాల, తుంగభద్ర జలాశయాలను నుంచి భారీగా వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నారు దాదాపు 5 లక్షల కూసెక్కుల నీరు శ్రీశైలం జలాశయంకు రెండు రోజుల్లో రానుంది. ఇంకా 14 లక్షల కూస్కెల నీరు వస్తే సాగర్ జలాశయం నిండుతుంది. అయితే ఇంతకు మించి నీరువచ్చి చేరితే సాగర్ నుంచి దిగువకు నీరు విడుదల అవకాశం ఉంది.

కుడి కాలువ ఆయకట్టు వివరాలు ఇలా..

జిల్లా	ఆయకట్టు(ఎకరాల్లో)
పల్నాడు	5,71,695
గుంటూరు	95,851
బాపట్ల	1,88,459
ప్రకాశం	2,60,618
మొత్తం	11,16,623

నీటి నిల్వ పెరుగుదల తేదీల వారీగా

తేదీ	టీఎంసీలు
జూలై 27	129.98
28	134.06
29	135.78
30	152.58
31	169.31
ఆగస్టు 1	182.95

డీసీసీబీలో రూ. కోట్లు కొల్లగొట్టారు

● వైసీపీ హయాంలో అడ్డగోలుగా అక్రమాలు
● నకిలీ పట్టాదారు పాసు పుస్తకాలతో రుణాలు
● అక్రమార్కులతో అధికారులూ కుమ్మక్కైనట్లు ఆరోపణలు..
● లేమల్లెపాడు వాసికి నోటీసులతో తాజా స్కాం

గుంటూరు, ఆగస్టు1: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)లో అక్రమ రుణాల వ్యవహారాలు ఒక్కొక్కటికి వెలుగులోకి వస్తోన్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పెద్దల అండతో కొందరు అధికారులూ కుమ్మక్కై నిబంధనలకు పాతరేసి రుణాలిచ్చి కోట్లు కొల్లగొట్టినట్లు ఆరోప ణలు వెల్లువెత్తుతోన్నాయి.

డీసీసీబీ పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో నకిలీ పాసు పుస్తకాలతో రూ.కోట్లను కొల్లగొట్టారు. అంతేగాక పల్నాడు జిల్లాలో కోల్డ్ స్టోరేజ్‌లలో ఉన్న సరుకు చూపించి రైతుల పేరుతో దాని యజమాని రూ. 5 కోట్లు నొక్కేశారు. ఇందులో వైసీపీ పెద్దల పాత్ర ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. డీసీసీబీ పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో నకిలీ పట్టాదారు పాసు పుస్తకాలు , ఆధార్ కార్డులు పెట్టి పెద్ద ఎత్తున రుణాలు పొందారు. సామాన్య కూలీల పేర్లతో సొసైటీల్లో భారీగా రుణాలు పొందారు. ఇందులో అధికారులు, అప్పట్లో వైసీపీ నేతలు కుమ్మక్కై ఈ వ్యవహారం నడిపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.


తాజాగా వట్టిచెరుకూరు మండలం లేమల్లెపాడుకు చెందిన సిద్ధార్థకు నల్లపాడులోని డీసీసీ బ్యాంకు నుంచి రూ.10 లక్షలు రుణం తీసుకున్నట్లు, వారం రోజుల్లోగా చెల్లించాలంటూ నోటీసులు అందటంతో అతను ఖంగుతిన్నాడు. వాస్తవానికి అతనికి బ్యాంకుతో ఎటువంటి సంబంధం లేదు. కానీ అతనికి నోటీసులు అందటంతో సిద్ధార్థ నల్లపాడు బ్యాంకు అధికారులను నిలదీయటంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. సిద్ధార్థ పేరుతో కోల్డ్ స్టోరేజ్‌లో మిర్చి ఉందని, దానిపై రుణం ఇచ్చినట్లు రికార్డులు సృష్టించినట్లు వ్యవహారం బయటపడింది. దాంతో సిద్ధార్థ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. అసలు విషయం బయటకు పొక్కటంతో బ్యాంక్ అధికారులు హుటాహుటిన ఆ రుణం తీసుకున్న వారి వద్ద నుంచి నగదు బ్యాంకుకు జమ చేయించినట్లు సమాచారం. అయితే ఇలాంటివి అనేకం జరిగాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఒక్క బ్రాంచ్ నుంచే అనేక మందికి నోటీసులు వెళ్ళాయని, తాము రుణం తీసుకోలేదంటూ బ్యాంకుకు వస్తున్నట్లు సమాచారం.

డ్వాక్రా రుణాల్లోనూ అక్రమాలు ?

డీసీసీబీలో వ్యక్తిగతరుణాలే కాకుండా డ్వాక్రా రుణాల్లో కూడా పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్ర బ్యాంక్ లో జరిగిన మోసాలపై విచారణ జరపించాలని డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వం డ్వాక్రా మహిళల రుణాలను కూడా జిడిసిసిబి నుండి ఇవ్వొచ్చని చెప్పడంతో అనేక డ్వాక్రా సంఘాలు తమ రుణాలను జిడిసిసిబి కి మార్చుకున్నాయి. వీటితో పాటు ప్రాథమిక సహకార సంఘాల్లో కూడా బినామీ పేర్లతో రుణాలు పొందినట్లు వాటిపై విచారణ జరిపించాలని అప్పటి టిడిపి నేతలు పెద్ద ఎత్తున డిమాండ్ చేశారు. బ్యాంక్ కొత్త ఛైర్మన్ వచ్చేలోపే గత ప్రభుత్వం హయంలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

విచారణకు మోకాలడ్డిన వైసీపీ కీలక నేత

నకిలీ పట్టాదారు పాసుపుస్తకాలతో రుణాలు పొందిన వ్యవహారంపై సొసైటీ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా పోలీసుల విచారణ దశలో వైసీపీ కీలక నేత రంగంలోకి దిగారు. మొత్తం వ్యవహారం బయటపడితే అసలు సూత్రధారులు, పాత్రదారులు బయటపడే అవకాశం ఉండటంతో సదరు కీలక నేత అడ్డుకునే ప్రయత్నం చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని

సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, ఆగస్టు 1: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం గురువారం నాటికి 537.40 అడుగులు ఉంది. ఇది 182.95 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 900 క్యూసెక్కులు, కుడి కాలువ ద్వారా 4152 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 22,592 క్యూసెక్కులు, మొత్తం అవుట్ ఫ్లో వాటర్‌గా 27,644 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 3,69,866 క్యూసెక్కులువచ్చి చేరుతోంది.

పథకాలకు త్యాగమూర్తుల పేర్లు

● గురజాల ఎమ్మెల్యే యరపతినేని

పొందుగుల (దాచేపల్లి), ఆగస్టు 1: అభివృద్ధి, సంక్షేమ పథకాలకు త్యాగమూర్తులు పేర్లు పెట్టుకున్నామని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలియజేశారు. గురువారం దాచేపల్లి మండలం పొందుగుల గ్రామంలో విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే యరపతినేని, మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తితో కలిసి మాట్లాడారు. ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ పిడుగురాళ్ల సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆసుపత్రిగా, అద్దంకి - నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారికి పల్నాడు ప్రాంత వాసి ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు కన్నెగంటి హనుమంతు పేర్లు పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. గత నాలుగేళ్లుగా వైసీపీ పాలనలో అక్రమ కేసులు, ఆస్తులు విధ్వంసం, హత్యారాజకీయాలు మాత్రమే సాగిందన్నారు. కూటమి ప్రభుత్వం అందుకు భిన్నంగా సంక్షేమం, అభివృద్ధి అజెండాతో ముందుకు సాగుతోందన్నారు. ఈ క్రమంలో గురజాల నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామన్నారు. జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు విజన్ కలిగిన నేత అని, ఆయన పాలనలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. గురజాల నియోజకవర్గ పరిశీలకుడు కళ్లం రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ టీడీపీ పాలనలో రాష్ట్రం తిరిగి అభివృద్ధిని పుంజుకుంటుందని స్పష్టం చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	101, 109,120
చికెన్ విత్ స్కిన్	194.00
చికెన్ స్కిన్ లెస్	204.00

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

● జడ్పీ ఛైర్ పర్సన్ కత్తెర దంపతులు



గుంటూరుసిటీ, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ గురువారం తెలిపారు. ఎస్సీలలోని అన్ని కులాలకు ఈ వర్గీకరణ ద్వారా సామాజిక న్యాయం జరుగుతుందని అన్నారు. 30ఏళ్ల సుదీర్ఘ పోరాటం ద్వారా వర్గీకరణను సాధించుకోవడం అభినందనీయమని అన్నారు. వర్గీకరణకు సాధనకు సహకరించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ,అదే విధంగా వర్గీకరణకు మొదటినుంచి మద్దతు తెలిపిన సీఎం చంద్రబాబు నాయుడుకు ఆయా వర్గాలు రుణపడి ఉన్నాయన్నారు. పోరాటాన్ని తన భుజస్కంధాలపై వేసుకుని అలుపెరగని పోరాటం చేసి విజయం సాధించిన మందకృష్ణ మాదిగకు అభినందనలు తెలియజేశారు.

వర్గీకరణకు మద్దతు పలికింది చంద్రబాబే

● ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



ప్రత్తిపాడు, ఆగస్టు 1: దేశంలో మొట్ట మొదటి సారి ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపింది చంద్రబాబు నాయుడే అని, వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. ప్రత్తిపాడు మండలం చినకోండ్రుపాడులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... వర్గీకరణ వ్యవహారం ఆయా రాష్ట్రాలకే ఇవ్వడం సుభ పరిణామమన్నారు. సుప్రీం కోర్టు తీర్పుకి కట్టుబడి, ఏ వర్గానికి అన్యాయం జరగకుండా, అందరికి సమ న్యాయం చేస్తామన్నారు. దళితుల మధ్య ఆర్థిక అసమానతలను తొలగించడానికి జీవో 25ను చంద్రబాబు తీసుకువచ్చారని ఎమ్మెల్య తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు చంద్రబాబు సానుకూలం

● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి



తాడికొండ, ఆగస్టు1: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు సీఎం నారా చంద్రబాబునాయుడు ఎప్పుడూ సానుకూలంగానే వ్యవహించారని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి తెలిపారు.. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుపై మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి స్పందించారు. సుప్రీంకోర్టు తీర్పుతో మాదిగల చిరకాల పోరాటానికి ఫలితం దక్కిందన్నారు. సామాజిక న్యాయం పాటించే పేటెంట్ హక్కు టీడీపీదేనని మరోసారి స్పష్టమైందన్నారు. కులాల మధ్య జగన్ చిచ్చు పెట్టి చలికాచుకు న్నారన్నారు. మాదిగలకు కేవలం తన ఓటు బ్యాంకుగానే జగన్ చూశార తప్ప ఏనాడు వర్గీకరణపై మాట్లాడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వం ఎస్సీల అభ్యున్నతికి కట్టుబడి ఉందన్నారు.

ఎన్ఐ వర్క్‌లు కారణంగా 14 రైళ్ల రద్దు

● ఎనిమిది రైళ్ల దారి మళ్లింపు ● డీఆర్‌ఎం రామకృష్ణ వెల్లడి

గుంటూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా గుంటూరు మీదగా ప్రయాణించే 11 రైళ్లని దాదాపుగా వారం పాటు రద్దు చేస్తున్నట్లు డీఆర్‌ఎం ఎం రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4 నుంచి 11వ తేదీ వరకు నెంబరు. 07781 విజయవాడ - మాచర్ల, ఈ నెల 5 నుంచి 12వ తేదీ వరకు నెంబరు. 07782 మాచర్ల - విజయవాడ ప్యాసింజర్ రైళ్లు రద్దు చేశామన్నారు. ఈ నెల 5 నుంచి 10వ తేదీ వరకు నెంబరు 07464 విజయవాడ - గుంటూరు, నెంబరు. 07465 గుంటూరు - విజయవాడ రైళ్లు రద్దు చేసినట్లు తెలిపారు. ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు నెంబరు 07281 నరసపూర్ - గుంటూరు, ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు నెంబరు. 07281 నరసపూర్ - గుంటూరు, నెంబరు. 07785 రేపల్లె - గుంటూరు, నెంబరు. 07976 గుంటూరు - విజయవాడ, ఈ నెల 5 నుంచి 10వ తేదీ వరకు నెంబరు. 17201 గుంటూరు - సికింద్రాబాద్, ఎంబరు. 17202 సికింద్రాబాద్ - గుంటూరు గోల్కొండ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు నెంబరు. 17329 హుబ్లీ - విజయవాడ, ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు నెంబరు. 17330 విజయవాడ - హుబ్లీ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశామన్నారు. ఈ నెల 5, 7, 8, 9, 10 తేదీల్లో నెంబరు. 12077 చెన్నై సెంట్రల్ - విజయవాడ జనశతాబ్ది, నెంబరు. 12078 విజయవాడ - చెన్నై సెంట్రల్ జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేశామని తెలిపారు.

కాగా నెంబరు. 12760 హైదరాబాద్ - తాంబరం ఎక్స్‌ప్రెస్, నెంబరు. 12759 తాంబరం - హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 2 నుంచి 10వ తేదీ వరకు నల్గొండ, గుంటూరు మీదగా దారి మళ్లించడం జరుగుతుందన్నారు. నెంబరు. 12764 సికింద్రాబాద్ - తిరుపతి ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 2, 4, 5, 6, 8, 9 తేదీల్లో నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, గుంటూరు మీదగా దారి మళ్లిస్తామన్నారు. నెంబరు. 12710 సికింద్రాబాద్ - గూడూరు ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 2 నుంచి 10వ తేదీ వరకు మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు మీదగా దారి మళ్లిస్తాం. నెంబరు. 17406 ఆదిలాబాద్ - తిరుపతి కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 2 నుంచి 10వ తేదీ వరకు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగాదారి మళ్లించి నడుపుతామన్నారు. నెంబరు. 12763 తిరుపతి - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 3, 5, 6, 7, 9, 10 తేదీల్లో గుంటూరు, పిడుగురాళ్ల, మిర్యాలగూడ, నల్గొండ మీదగా దారి మళ్లిస్తామన్నారు. నెంబరు. 12709 గూడూరు - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు గుంటూరు, సత్తెనపల్లి, మిర్యాలగూడ మీదగా నడుపుతామన్నారు. నెంబరు. 17405 తిరుపతి - ఆదిలాబాద్ కృష్ణ ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ మీదగా దారి మళ్లిస్తామన్నారు.

అరాచక శక్తులను అణచివేస్తాం

● కూటమి నేతలు సంయమనంతో వ్యవహరించాలి
● మాచర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్ / రెంటచంతల, ఆగస్టు 1: వైసీపీ అరాచక శక్తులు రాష్ట్రంలో శాంతి భద్రతలకు ఆటంకం కలిగించాలని కుట్రలు పనుతున్నాతున్నారని, ఉక్కుపాదంతో వారిని అణిచివేస్తామని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మాచర్ల పట్టణంలో గురువారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 36 హత్యలు జరిగాయని వైసీపీ నేతలు ఢిల్లీకెళ్లి రాద్ధాంతం చేయటం సిగ్గుచేటన్నారు. వైసీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై దాడులు జరిగినప్పుడు, ఆస్తులు లాక్కొని పోలీసులు దౌర్జన్యం చేసినప్పుడు, హత్యలు, అత్యాచారాలు జరిగినప్పుడు అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు నోరు విప్పలేదని ప్రశ్నించారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ఎవరినైనా ఉపేక్షించేది లేదన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆద్యుడని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి కొనియాడారు.

రెంటచింతల, పాలువాయిగేట్ గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి స్థానిక నేత నంబూరి శేషగిరిరావుని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డికి కర్రు కాల్చి వాతలు పెట్టినా ఇంకా బుద్ధిరాలేదన్నారు. వ్యక్తిగత కలహాల జరిగిన హత్యలను టీడీపీపై మోపిన వైసీపీ నేతలు రాజకీయంగా మరింత దిగజారిపోయారన్నారు. వైసీపీ హయాంలో విచ్చలవిడిగా అవినీతి, అక్రమాలు, హింస, దౌర్జన్యాలు రాజ్యమేలాయని, వాటన్నింటిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

40,795 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 41,894 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 40,795 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా యార్డు ఆవరణలో 20,905 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు తెలిపారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	17000	334	9000	16500
నెంబరు. 5	9500	14000	నెంబరు. 5	9700	15000
273	9000	12000	273	11500	14000
341	9000	17000	341	10000	14300
4884	12500	12500	4884	11500	16000
సూపర్ 10	13500	13500	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18700	తేజ	8500	18500
బ్యాడిగి	8000	14500	బ్యాడిగి	9000	13500
దేవనూరు డీలక్స్	11500	12000	దేవనూరు డీలక్స్	10500	15000
తెల్లకాయలు	4000	12000	తెల్లకాయలు	5000	11500

పల్నాడు వార్తలు



పాలువాయిగేట్‌లో దివ్యాంగురాలికి పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్ అందిస్తాం

● మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, ఆగస్టు 1: ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్ అందించి అవ్వాతాతల మోముల్లో చిరునవ్వులు పూయిస్తామని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. గురువారం ఆయన పట్టణంలోని చెన్నకేశవస్వామి ఆలయ సమీపంలో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ను అందజేశారు. అలాగే పట్టణంలోని పలు వార్డుల్లో టీడీపీ సీనియర్ నేత, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు పింఛన్ పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత యెనుముల కేశవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, మున్నా రాంబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కారంపూడి: మండలంలోని నరమాలపాడులో గురువారం ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, మండల అధ్యక్షుడు చప్పిడి రాము, గోళ్ల సురేష్ యాదవ్, బొల్నేడి హరికృష్ణ, సత్యం, అధికారులు పాల్గొన్నారు. అలాగే డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

వెల్దుర్తి: మండలంలోని మండాది గ్రామంలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు శివారెడ్డి, పులుసు శివారెడ్డి, వజ్రం నాయక్, పాపిరెడ్డి, అంకిరెడ్డి, బీసీ కొండలు, రామిరెడ్డి, ఎంపీడీవో నరసింహం తదితరులు పాల్గొన్నారు.

రెంటచింతల : పాలువాయిగేట్ గ్రామంలో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకరావు,టీడీపీ నేతలు నంబూరి శేషగిరి, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాసరావు, సాంబయ్య, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అవినీతికి తావులేకుండా పనిచేయండి

● మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, ఆగస్టు 1: నియోజకవర్గంలోని అధికారులు అవినీతికి తావు లేకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గురువారం అమరావతిలో ఎంపీపీ హనుమంతరావు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రవీణ్ ముందుగా శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో అంటువ్యాధులు ప్రబలకుండా పంచాయతీ, వైద్యశాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ అధికారులు రైతుల సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. ఇసుక, మట్టి, రేషన్, మద్యం దుకాణాలు తదితర విషయాల్లో జరిగే అక్రమాలపై అధికారులు కఠినంగా వ్యవహరించాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వంగా గుర్తింపు రావాలని, అందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో రాణీ, డీఎల్‌డీవో రాజగోపాల్, వైస్ ఎంపీపీ ఎం. శ్రీనివాసరావు, డీటీ సునీత, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన

మండల పరిధిలోని మునగోడు గ్రామంలో మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం రూ. 34 లక్షలతో సీసీ రహదారుల నిర్మాణంతో పాటు కాజ్‌వే నిర్మాణ పనులకు గురువారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శంకుస్థాపన చేశారు. ముందుగా ప్రవీణ్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరము ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రవీణ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో రహదారులు, విద్యుత్ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హనుమంతరావు పాల్గొన్నారు.

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిలర్‌గా కోటేశ్వరరావు

పిడుగురాళ్ల, ఆగస్టు 1: పట్టణ పురపాలక సంఘ స్టాండింగ్ కౌన్సిల్ కౌన్సిలర్‌గా న్యాయవాది ఉడతా కోటేశ్వరరావు నియమితులయ్యారు. మున్సిపాలిటీకి సంబంధించి న్యాయ సలహాలు, కోర్టు కేసుల నమోదు, వాదించటానికి ఉడతా కోటేశ్వరరావును మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా కౌన్సిలర్‌గా నియమిస్తూ మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఈ మేరకు గురువారం కోటేశ్వరరావు నియామకపు పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావుని బార్ అసోసియేషన్ అధ్యక్షులు కుమారస్వామి, సీనియర్ న్యాయవాది కరణం కాశీవిశ్వనాథం, సాంబశివరావు, చెన్నయ్య, చంద్రశేఖర్ రావు, అహమ్మద్, ఎస్‌వీ కోటేశ్వరరావు, రామిరెడ్డి తదితరులు అభినందించారు.

విద్యార్థులు కాలం విలువ తెలుసుకోవాలి

● ఆర్టీఐ రాష్ట్ర ఇన్ఫర్మేషన్ కమిషనర్ చావలి సునీల్

క్రోసూరు, ఆగస్టు 1: విద్యార్థులు కాలం విలువ తెలుసుకోవాలని, కాలాన్ని వృథా చేయకూడదని ఆర్టీఐ రాష్ట్ర ఇన్ఫర్మేషన్ కమిషనర్ చావలి సునీల్ సూచించారు. గురువారం క్రోసూరు మండలం హసానాబాద్ జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు స్వీకరించిన ఇక్కుర్తి లక్ష్మీనారాయణ అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ విద్యార్థులు బాల్య వివాహాలు, చాందస భావాలను తీవ్రంగా వ్యతిరేకించాలన్నారు. మన భవిష్యత్ మన చేతుల్లో ఉంటుందనే విషయాన్ని గ్రహించాలన్నారు. విద్యార్థులు సాధించే ప్రతి విజయం పుట్టిన ఊరికి, కన్న తల్లిదండ్రులకు, చదివిన పాఠశాలకు, చదువు చెప్పిన ఉపాధ్యాయులు పేరు ప్రఖ్యాతులు సాధించి పెడుతుందన్నారు.ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటానికి శాయ శక్తులా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 గణేష్, హెచ్ఎం షేక్ ముస్తఫా, హైస్కూల్ ఉపాధ్యాయులు అరుణ కుమారి, విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్తలకు బీమా నగదు అందజేత

రాజుపాలెం, ఆగస్టు1: మండలంలోని దేవరంపాడు గ్రామానికి చెందిన జనసేన పార్టీ కార్యకర్త రుసుం సామ్రాజ్యం రోడ్డు ప్రమాదానికి గురికాగా ఆమెకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50 వేలు స్థానిక పార్టీ నేతలు గురువారం అందజేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన తాడువాయి ప్రశాంతి పాము కాటుకు గురికాగా, వైద్యఖర్చుల నిమిత్తం రూ.17,700 మండల జనసేన పార్టీ అధ్యక్షుడు తోట నరసయ్య అందజేశారు. కార్యక్రమంలో జనసేన మండల ఉపాధ్యక్షులు బత్తుల హనుమంతురావు, రుసుం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

మాచర్ల రూరల్, ఆగస్టు 1: మండలంలోని పెద అనుపులో శీలం పోతమ్మ అనారోగ్య కారణాలతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు గురువారం గ్రామానికి చేరుకొని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు ఆమె కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గోపినాయక్, రంగానాయక్, దుర్గారావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

దుర్గి, ఆగస్టు 1: దుర్గిలోని ముటుకూరు రోడ్డువద్ద గల మారుతీనగర్ కాలనీ వాసుల తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. గురువారం దుర్గికి వచ్చిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దృష్టికి కాలనీ వాసులు సమస్యలను తీసుకెళ్లారు. అక్కడే వున్న ఎంపీపీ సునీత సాయిశంకర్ తన సొంత నిధులతో పంచాయతీ నుంచి ప్రత్యేక పైపులైన్‌ను కాలనీకి ఏర్పాటు చేయంచి తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ఎంపీపీ సునీత సాయిశంకర్‌ను అభినందించారు.

విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ

మండల కేంద్రమైన దుర్గిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గురువారం ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులు రాణిస్తున్నారన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ సునీత సాయిశంకర్, లింగా రమేష్, జక్కా కొండలు, కటకం రామారావు, సింగు నాగేశ్వరరావు, గోపాల్, వెంకటేశ్వర్లు, చిన చెన్నయ్య కృష్ణ, రామారావు, జనసేన నేతలు పులిహరి, రుద్రాల రవి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పథకాలతో నిరుపేదలకు భరోసా



శ్రీనగర్‌లో పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని, జంగా తదితరులు

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు
● మాజీ ఎమ్మెల్సీ జంగాతో కలసి పింఛన్ల పంపిణీ
● పాల్గొన్న కూటమి నేతలు, స్థానిక ప్రజలు

దాచేపల్లి, ఆగస్టు 1: ప్రభుత్వ పథకాలను నేరుగా అందించి నిరుపేదలకు భరోసా కల్పించడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా దాచేపల్లి మండలం శ్రీనగర్, పొందుగుల గ్రామాల్లో పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి యరపతినేని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నా సంక్షేమ పథకాల పంపిణీ కార్యక్రమాలను మాత్రం ప్రతిష్టాత్మకంగా తీసుకొని అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో గురజాల నియోజకవర్గ పరిశీలకుడు కళ్లం రాజశేఖరరెడ్డి, నేతలు తంగెళ్ల శ్రీనివాసరావు, బెల్లంకొండ బద్రి, కొప్పుల గిరి, డాక్టర్ కర్నాటి వరలక్ష్మి, నర్రా పుల్లయ్య, వేముల వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పురపాలక సంఘం, రూరల్ పరిధిలో సంబంధిత అధికారులు, పార్టీ శ్రేణులు 5 గంటలకు ప్రారంభించిన పింఛన్ పంపిణీ 11.30 గంటలకు 89 శాతం పూర్తి చేయగా సాయంత్రం 5 గంటలకు 99 శాతం పైగా పింఛన్‌ను పంపిణీ చేశారు. పల్నాడు జిల్లా పరిధిలో గురజాల నియోజకవర్గ పింఛన్ పంపిణీలో మొదటిస్థానంలో నిలిచింది. ఉదయం 8 గంటలకు, 11.30 గంటలకు 89 శాత పూర్తి చేసి జిల్లా పరిధిలో మొదటి స్థానంలో నిలిచింది.కమిషనర్ గిరికుమార్, ఎంపీడీవో డీ. సుబ్బారావులు ఆయా వార్డు, గ్రామాల పరిధిలో పింఛన్ పంపిణీని పర్యవేక్షించారు.

పట్టణంలోని 25వ వార్డుకు చెందిన షేక్ బాషా అనారోగ్య కారణంగా స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతు న్నాడు. గురువారం ప్రభుత్వం అందజేసిన పింఛన్‌ను వార్డు ఇన్‌ఛార్జి షేక్ జమాల్ సైదా, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు నకరికంటి శివ, మహ్మబూబ్ జానీలు ఆస్పత్రికివెళ్లి రూ.4 వేల పింఛన్ నగదును బాషాకు అందజేశారు.

గురజాలటౌన్: గురజాల పట్టణ, మండల పరిధిలో గురువారం ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. ఆయా చోట్ల కూటమి నేతలు లబ్ధిదారులకు పింఛన్లను అందించారు. మండలంలో 98 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

మాచవరం: మండలంలో 15 గ్రామ పంచాయితీలో 97శాతం పింఛన్ పంపిణీ పూర్తి అయినట్లు ఎంపీడీవో సురేష్ తెలిపారు. 7,425 పింఛన్‌లకు గాను 7160 పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నెలబెట్టుకుంటున్న చంద్రబాబు

● సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ
● వివిధ ప్రాంతాల్లో లబ్ధిదారులకు పింఛన్లు అందజేత

సత్తెనపల్లి, ఆగస్టు 1: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నారని, హామీలు నెరవేర్చి ప్రజల్లో ఆనందం నింపుతున్నారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 10వ వార్డులో గురువారం ఎన్‌టీఆర్ సామాజిక భరోసా పింఛన్‌లను మునిసిపల్ అధికారులు, స్థానిక నేతలతో కలసి ఆయన ఇంటింటి తిరిగి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి నారా చంద్రబాబు నాయుడు పెంచిన పింఛన్‌లను అందజేస్తున్నారన్నారు. వితంతువులు, వికలాంగులు, వృద్ధుల్లో మనోధైర్యం కల్పించారన్నారు. పింఛన్‌లు అందుకున్న లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం కన్పిస్తుందన్నారు. సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ షమ్మి, మాజీ చైర్మన్ ఎలినేడి రామస్వామి, ఆతుకూరి నాగేశ్వరరావు, నూర్ బాషా జానీబాబు, శ్రీనివాసరావు, దరువూరి నాగేశ్వరరావు, రాంబో బుడే, కందిమళ్ళ రజిని, కొండలు, అంబిక తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెం: మండలంలోని అన్ని గ్రామాల్లో పెన్షన్ల పంపిణీ విజయవంతమైంది. ప్రభుత్వ అధికారులు, సిబ్బందితో సమష్టిగా పనిచేసి మండలం మొత్తం మీద 98.24 శాతం పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, మండల కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నందిగామలో మహిళకు ఫింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి రూరల్: మండలంలోని నందిగామలో గురువారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పింఛన్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని, వలంటీర్ వ్యవస్థ లేక పోయినా పింఛన్‌లను విజయవంతంగా పంపిణీ చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి, కట్టావారిపాలెం సర్పంచ్ సువ్వుల రాంబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు ఆళ్ళ అమరేశ్వరరావు, ఆళ్ళ సాంబయ్య, కోమటినేని శ్రీనివాసరావు, మండదపు సాంబశివరావు, వక్కంటి అజయ్, వాసిరెడ్డి నరేంద్ర, బలిజేపల్లి విజయ కుమార్, బీజేపీ నాయకులు కట్టా శంకరరావు, ఎంపీడవో జగదీష్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలి

● గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు
● ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

పిడుగురాళ్ల, ఆగస్టు 1: ప్రతి విద్యార్థి పాఠశాల స్థాయి నుంచే ఎంచుకున్న లక్ష్యం సాధించేందుకు తపన పడాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి యరపతినేని మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్దేశించుకొని, ఆవైపుగా కృషిసాగించేలా విద్యార్థులు నడుచుకోవాలన్నారు. అబ్దుల్ కలాం లాంటి గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. స్థానిక జూనియర్ కళాశాలను డిగ్రీ కళాశాలగా మార్చేందుకు కృషిచేస్తానని, కళాశాలలో మౌలిక వసతుల ఏర్పాటుకు మంత్రి నారా లోకేశ్‌తో మాట్లాడి ప్రత్యేక నిధులు సమకూరుస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి మారుతున్న సాంకేతికతను అవగాహన చేసుకొని చదువులో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం యరపతినేని, జంగాలు తరగతి గదులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, తహసీల్దార్ మధుబాబు, పాండురంగ శ్రీను, హెచ్ఎం లింగాల ధనలక్ష్మీ, విజయసారథి, కటకం అంకారావు, కామిశెట్టి రమేష్, దూదేకుల కాశింసైదా, కళ్లం రాజశేఖర్ రెడ్డి, సయ్యద్ అమీర్ అలీ, వడ్డవల్లి సాంబశివరావు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం

నకరికల్లు, ఆగస్టు 1 : తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమని నకరికల్లు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మణికంఠ తెలిపారు. గురువారం నరసింగపాడులోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యతను గురించి బాలింతలకు వివరించారు. అలాగే ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. నకరికల్లు పీహెచ్‌సీ నుంచి తల్లిపాల వారోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ షేక్.హసీనా, పీహెచ్‌వో రామాంజనేయులు, హెచ్ఈపీఎల్ భ్రమరాంబ, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఆషా కార్యకర్తలు, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజుపాలెం: తల్లి పాలలో ఎదగడానికి అవసరమైన విటమిన్లు, ప్రోటీన్, సంపూర్ణ పోషణ లభిస్తుందని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ బాల అంకమ్మ బాయ్ తెలిపారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల అంకమ్మబాయ్ వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జీవనరావు, స్టాఫ్ నర్సు చందన, రమాదేవి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు

సత్తెనపల్లి రూరల్, ఆగస్టు 1: సత్తెనపల్లి తహసీల్దార్‌గా కేఎస్ చక్రవర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పిడుగురాళ్ళ తహసీల్దార్‌గా పని చేస్తూ బదిలీపై సత్తెనపల్లి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను కార్యాలయ సిబ్బంది పరిచయం చేసుకున్నారు.

నకరికల్లు: నకరికల్లు తహసీల్దార్‌గా కట్టికోట పుల్లారావు గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ప్రజలకు రెవెన్యూ సేవలు వేగవంతంగా అందించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తహసీల్దార్ పుల్లారావు తెలిపారు.

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల మండల తహసీల్దారుగా జే.మధుబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని, రెవెన్యూ రికార్డుల భద్రతకు ప్రాధాన్యమిస్తానని తెలిపారు.

గురజాలటౌన్: గురజాల మండల తహసీల్దారుగా కే. నగేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నెల్లూరు జిల్లా నుంచి బదిలీపై గురజాలకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన అశోక్‌రెడ్డి బదిలీపై వెళ్లారు. తహసీల్దార్ నగేష్ 2020లో గురజాల ఆర్డీవో కార్యాలయ ఏవోగా విధులు నిర్వహించారు.

కారంపూడి: కారంపూడి తహసీల్దార్‌గా బీవీఆర్‌సీహెచ్ గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో మాచవరం తహసీల్దార్‌గా పనిచేస్తూ ఎన్నికల విధుల్లో భాగంగా తిరుపతి జిల్లాకు బదిలీకాగా, అక్కడ నుంచి కారంపూడికి వచ్చారు.

అమరావతి: అమరావతి తహసీల్దార్‌గా ఎస్.నాగమల్లేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. గతంలో తహసీల్దార్‌గా పనిచేసిన వెంకటరమణారావు స్వంత జిల్లా నెల్లూరుకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో నాగమల్లేశ్వరరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయసిబ్బంది, అధికారులు అభినందనలు తెలిపారు.

అచ్చంపేట: అచ్చంపేట మండల తహసీల్దార్‌గా జీ.శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి జిల్లా డక్కిలి మండలం నుంచి అచ్చంపేటకు ఆయన బదిలీపై వచ్చారు. ఈయన గతంలో బెల్లం కొండ, వెల్దుర్తి, బొల్లాపల్లి, కారంపూడి మండలాల్లో తహసీల్దార్‌గా పనిచేశారు.


అన్నక్యాంటీన్ల పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

సత్తెనపల్లి, ఆగస్టు 1: పట్టణంలోని తాలూకా సెంటర్ వద్ద గల అన్నక్యాంటీన్ పునర్నిర్మాణ పనులను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన అన్నక్యాంటీన్‌లు కార్మికులు, కూలీలు, యాచకులకు ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. పేదల ఆకలి తీర్చాలని అన్నా క్యాంటీన్‌లను ఏర్పాటు చేసిన ఘనత నారా చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. జగన్ పాలనలో అన్నా క్యాంటీన్‌లు రద్దు చేసిందన్నారు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో పేద వారికి మూడు పూటలా ఆహారం దొరికే విధంగా అన్నా క్యాంటీన్‌లు తిరిగి పునఃప్రారంభించటం జరుగుతుందన్నారు. సత్తెనపల్లి పట్టణంలో ఆగస్టు 15న అన్నా క్యాంటీన్‌లను ప్రారంభిస్తామన్నారు. తెలుగు యువత నేత మన్నెం శివనాగమల్లేశ్వరరావు 565 రోజులు సత్తెనపల్లి పట్టణంలో ఉచితంగా అనక్యాంటీన్ నిర్వహించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నేతలు ఎలినేడి రామస్వామి, ఆతుకూరి నాగేశ్వరరావు, నూర్‌బాషా జానీబాబు, రాంబో బుడే, గుంటూరు ఆశీర్వాదం టీడీపీ కార్యకర్తలు పలువురు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పంట రుణాలు అందించాలి

● బ్యాంకు అధికారులతో జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళి

రాజుపాలెం, ఆగస్టు 1 : రాజుపాలెం బ్రాంచ్ పరిధిలో గుర్తింపు పొందిన కౌలు రైతులకు పంట రుణాలు అందించాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్‌ను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి కోరారు. పంట రుణాల విషయమై గురువారం రాజుపాలెం యూనియన్ బ్యాంక్ మేనేజర్‌ను ఆయన కలిసి మాట్లాడారు. వ్యవసాయ శాఖ నుంచి కౌలు గుర్తింపు కార్డులు పొందిన వారికి రుణాలను అందజేయాలని బ్యాంక్ మేనేజర్‌ను కోరారు. ముందుగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మండలంలోని అనుపాలెం గ్రామ సమీపంలో ఉన్న వరినారు మళ్ళు, పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ వరి విత్తనాలు విత్తుకునే 24 గంటల ముందుగా రైతులు వరి విత్తనానికి శిలీంధ్ర నాశిక మందులతో విత్తన శుద్ధి చేసుకొని విత్తుకోవాలని, అప్పుడే పైరుపై ముందస్తుగా తెగుళ్ల రాకుండా అరికట్టవచ్చునన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏడీఏ హనుమంతురావు, ఏవో వెంకట నరసయ్య పాల్గొన్నారు.



బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి



బయ్యవరంలో పింఛన్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

కూటమి పాలనలో అన్నీ మంచి రోజులే !

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాల పాటి, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్
● వివిధ ప్రాంతాల్లో లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ

పెదకూరపాడు, ఆగస్టు 1: కూటమి ప్రభుత్వ పాలనలో అందరికీ అన్నీ మంచి రోజులేనని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌లు అన్నారు. మండలంలోని హుస్సేన్ నగరంలో గురువారం వారు ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇచ్చిన మాట నిలబెట్టుకోవటం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. అర్హత కలిగిన వారి పింఛన్లను సైతం గత ప్రభుత్వ పాలనలో వైసీపీ నేతలు తొలగించారని, వాటన్నింటినీ పునరుద్ధరిస్తామని హామీనిచ్చారు. ముందుగా వారు గ్రామంలో పర్యటించి స్థానికుల నుంచి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామగోపాలరావు, నేతలు నెల్లూరు మల్లికార్జున్, గల్లా బాబూరావు, భాష్యం ఆంజనేయులు, ఏటుకూరి బ్రహ్మయ్య,షేక్ మస్తాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలో సచివాలయ సిబ్బంది, స్థానిక కూటమి నేతలు పింఛన్లను పంపిణీ చేశారు.

క్రోసూరు: మండలంలోని బయ్యవరంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. నియోజక వర్గంలో సుమారు రూ.9 కోట్ల పింఛన్‌లను అందజేస్తున్నట్లు తెలిపారు. పెదకూరపాడు నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు శాయ శక్తులా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గుడిపాడు బాషా, నేతలు పయ్యావుల శివన్నారాయణ, పలువురు పాల్గొన్నారు.

మండల కేంద్రం క్రోసూరులో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య పింఛన్లను అందజేశారు. ఆమె వెంట టీడీపీ నేతలు నలజాల కోటేశ్వరరావు, కొండవీటి శ్రీనివాసరావు, గుడిపాడు బాషా తదితరులు ఉన్నారు.

అచ్చంపేట : మండలంలో మొత్తం 8,908 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా 8,559 మందికి పింఛన్‌లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య ఓర్వకల్లు, అచ్చంపేట, తాళ్ళచెరువు, అంబడిపూడి, కోనూరు, కస్తల గ్రామాల్లో పర్యటించి పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, వెనిగండ్ల కోటయ్య, రాయిడి సాంబశివుడు, తాళ్ళూరి లక్ష్మీనారాయణ, తిరువాయిపాటి ఆంజనేయులు, ఎస్‌కే కాసుల, నల్లపాటి చందు, చల్లా అనూపకళ తదితరులు పాల్గొన్నారు.

అమరావతి : మండల పరిధిలోని దిడుగు గ్రామంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను లబ్ధిదారులకు పంపిణీచేశారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెల్లంకొండ: ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య గురువారం మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, బీసీ ప్రధాన కార్యదర్శి ఓర్సు ఆనంద్, గుంజా గంగారావు, తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా

● పల్నాడు జిల్లా ఎస్పీ కే శ్రీనివాసరావు

నకరికల్లు, ఆగస్టు 1 : రౌడీషీటర్లు, అనుమానితుల కదలికలపై, వారి కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేశారు. గురువారం ఆయన నకరికల్లు పోలీసు స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది పని తీరు, కేసుల దర్యాప్తు, కేసు డైరీ, క్రైం రికార్డులను పరిశీలించారు. మహిళా ఫిర్యాదుదారులకు మీటింగ్ రూమ్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నైట్‌బీట్ వ్యవస్థను బలోపేతం చేయటం ద్వారా నేరాలను అడ్డుకోవచ్చని, రాత్రి పగలు బీట్ల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. గంజాయి నిర్మూలనకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల సమయంలో నమోదైన కేసుల పరిస్థితిని సమీక్షించారు. పెండింగ్‌లోవున్న అరెస్టులను వెంటనే పూర్తి చేయాలన్నారు. బాలికల మిస్సింగ్, మహిళలపై దాడులు, అఘాయిత్యాలు, రోడ్డు ప్రమాద కేసులను సమీక్షించారు. ప్రధాన రహదారులవెంట ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చేపట్టవలసిన చర్యల గురించి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కే.నాగేంద్రరరావు, ఏఎస్‌ఐ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సత్తెనపల్లిలో మందా కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన మాదిగ ఉద్యోగులు

వర్గీకరణపై సుప్రీం తీర్పు హర్షణీయం

● వివిధ ప్రాతాల్లో ఆ సామాజిక వర్గ నేతల సంబరాలు

సత్తెనపల్లి, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయమని, మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ నేతలు తెలిపారు. గురువారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ చిత్రపటానికి తాలూకా సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు వంద తరాల భవిష్యత్‌ను నిర్దేశించబోతుందన్నారు. మందా కృష్ణ మాదిగ పోరాట స్ఫూర్తితో దేశంలోని ఎస్సీ ఉపకులాలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రధానమంత్రి మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జాన్‌సన్, రమేష్, హిట్లర్, దేవదానం, ప్రేమ్ కుమార్, నాగేశ్వరరావు, సురేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నేత గుజ్జర్లపూడి సాలినీ తాలూకా సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద స్వీట్లు పంపిణీచేశారు. వర్గీకరణకు కట్టుబడి ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు మాదిగలు రుణపడి ఉంటారన్నారు.

గురజాలటౌన్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు పట్ల ఎస్సీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ నేతలు పాల్గొన్నారు.

క్రోసూరు: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పుఇవ్వటంపై నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందా కృష్ణ మాదిగ మూడు దశాబ్దాల పోరాట ఫలితమే ఈ తీర్పు అని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు నందిగం దేవదాసు, వేమవరపు జీవన్, దుద్దుల యోహాన్, జడ సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

అమరావతి: వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ మునగోడు గ్రామంలో ఎమ్మార్పీఎస్ నేతలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల, గ్రామ ఎమ్మార్పీఎస్ నేతలు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల: ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వటాని ఎమ్మార్పీఎస్, ఎస్సీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. వర్లా ఆగష్టున్, మందా డేవిడ్, చల్లగుండ్ల బాబు, గుండాల ఆనంద్, వర్లా రత్నంతోపాటు పలువురు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుకి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

దుర్గి: ఎన్డీఏ అధికారం చేపట్టిన రెండు నెలల్లోనే ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ వర్గీకరణ ప్రకటించడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్ నేతలు అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మందాకృష్ణ మాదిగకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల దాసు, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందుకూరి రమేష్‌లు పలువురు స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. రాయపాటి మరియదాసు, భుజంగరావు, చాట్ల దీనయ్య, సైదులు, సంజయ్, శ్యాం, అభిషేక్, నాగరాజు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట


తాగునీటి సరఫరాపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

రెండు పూటలా నీరు అందించాలి

● మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం

నరసరావుపేట టౌన్, ఆగస్టు 1: నరసరావుపేట పట్టణంలో రెండు పూటలా తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆదేశించారు. గురువారం మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి తాగునీటి సమస్యపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ పట్టణంలో ఏ ఒక్కరూ తాగునీటి గురించి ఫిర్యాదుచేసే అవకాశం కూడా ఉండకూడదన్నారు. అధికారులు తాగునీటి విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. పలు ప్రాంతాలలో ఒకపూట మాత్రమే తాగునీరు వస్తున్నాయని ఫిర్యాదులు అందినట్లు చెప్పారు. పట్టణంలోని ప్రతి ఇంటికి రెండు పూటలా తాగునీరు కల్పించాలన్నారు. తాగునీటి పైపులైన్లు నిత్యం పరిశీలించాలన్నారు. పలుచోట్ల మురికి కాలువల సమీపంలో తాగునీటి పైపులైన్లు ఉన్నాయని ఫిర్యాదులు వచ్చాయని, వాటిని తక్షణమే పరిష్కరించేలా చూడాలన్నారు. ఆరోగ్యం బాగుండాలంటే నీరు అత్యంత కీలకమన్నారు. ప్రజారోగ్యం విషయంలో ప్రజా సమస్యల విషయంలో రాజీలేకుండా పనిచేయడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని చెప్పారు.

ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా వెంకటనాగరాజు బాధ్యతల స్వీకరణ


ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటనాగరాజు, ఇన్‌చార్జి డీటీగా నాసరయ్య

శావల్యాపురం, ఆగస్టు 1: జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా వేముల వెంకటనాగరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రస్తుతం ఇదే కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించిన నక్కా లక్ష్మీలావణ్య తూర్పు గోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఇదే కార్యాలయంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న పేరుసోముల నాసరయ్య ఇన్చార్జి డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎఫ్ఏసీ తహసీల్దార్ వెంకట నాగరాజు, ఇన్చార్జి డిప్యూటీ తహసీల్దార్ నాసరయ్యలకు వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ప్రత్యేక కౌంటర్ల ద్వారా కందిపప్పు, బియ్యం విక్రయం: కలెక్టర్

నరసరావుపేట రూరల్, ఆగస్టు 1: నిత్యావసర ధరలకు అరికట్టేందుకు పల్నాడు జిల్లాలో 22 ప్రత్యేక కౌంటర్ల ద్వారా కందిపప్పు, బియ్యం విక్రయించడం జరుగుతుందని పల్నాడు జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. పల్నాడు జిల్లాలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా కందిపప్పు రూ.150, బియ్యం రూ.47కు విక్రయించడం జరుగుతుందన్నారు. చిలకలూరిపేట, నరసరావుపేట, పిడుగురాళ్ళ, వినుకొండ, మాచర్ల, నకరికల్లు, అమరావతి, గురజాల, సత్తెనపల్లి, నాదెండ్ల, దుర్గి, తదితర మండలాల్లో మొత్తం 22 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

తల్లి పాలతో పిల్లలకు రోగనిరోధక శక్తి: డీఎంహెచ్‌వో రవి


కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ బి రవి

నరసరావుపేట లీగల్, ఆగస్టు 1: తల్లిపాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని పల్నాడు జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ బి రవి గురువారం తెలిపారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన వెంటనే బిడ్డకు గంటలోపు పాలు ఇవ్వాలన్నారు. ఆరు నెలల నుంచి రెండు సంవత్సరాల వరకు తల్లిపాలు అనుబంధ ఆహారం అందించాలన్నారు. తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం వలన తల్లులకు రొమ్ము క్యాన్సర్ గర్భ క్యాన్సర్ రాదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డాక్టర్ రవీంద్ర రత్నాకర్ వన్నూరు భాష సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో రాయితీపై వరి విత్తనాలు

● వ్యవసాయ శాఖ ఏడీఏ మస్తానమ్మ

'ఆంధ్రజ్యోతి'కి స్పందన

నరసరావుపేట రూరల్, ఆగస్టు 1: పల్నాడు జిల్లా ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వరి విత్తేదెలా కథనం గురువారం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన వ్యవసాయ శాఖ ఏడీఏ పి. మస్తానమ్మ వివరణ ఇస్తూ నరసరావుపేట సబ్‌డివిజన్ పరిధిలోని నరసరావుపేట, రొంపిచర్ల మండలాల్లో వరి ప్రధాన పంటగా సాగుచేస్తున్నారన్నారు. వరిసాగు విస్తీర్ణం 5వేల హెక్టార్లు కాగా దీనికి కావాల్సిన వరి విత్తనాలు 3,750 క్వింటాళ్ళు అవుతాయని అంచనా వేశామన్నారు. గతంలో రైతులు బీపీటీ 5204 రకాన్ని సాగు చేయడం ఆనవాయితీగా వస్తుందని దీని పంట కాల పరిమితి 150రోజులుగా ఉంటుందన్నారు. ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీటి లభ్యత నీటి విడుదలపై సందిగ్ధత ఉన్న నేపథ్యంలో తక్కువ కాలవ్యవధిలో పండే ఇతర వరి విత్తనాలపై రైతులు ఆసక్తి చూపుతున్నారన్నారు. జిల్లాలో ఏపీ సీడ్స్ ద్వారా బీపీటీ 5204 రకం వరి విత్తనాలు రూ.5 రాయితీపై రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులకు అవసరమైన వరి విత్తనాలు ప్రైవేటు విత్తన డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు.

పరిటాల సత్యనారాయణకు గౌరవ డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న పరిటాల సత్యనారాయణ

నరసరావుపేట లీగల్, ఆగస్టు 3: పట్టణానికి చెందిన పరిటాల సత్యనారాయణకు అమెరికా పోప్ తీయలాజికల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. కరోనా సమయంలో ప్రజలకు అయన చేసిన సేవలను గుర్తించి ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు. హైదరాబాదులోని త్యాగరాయ గాన సభలో ఇటీవల ఈ అవార్డును యూనివర్సిటీ చైర్మన్ జ్యోతి చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాన అందుకున్నారు. డాక్టరేట్ తన బాధ్యతను ఎంతో పెంచిందని మరిన్ని మంచి కార్యక్రమాలు చేయడానికి ప్రేరణగా ఉందన్నారు కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, హైకోర్టు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చంద్రమోహన్ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ 24క్రాఫ్ట్స్ డైరెక్టర్ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిపాలెం పీహెచ్‌సీలో రాష్ట్ర క్షయ నియంత్రణ అధికారి తనిఖీ

రొంపిచర్ల, ఆగస్టు 1: మండలంలోని రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర క్షయ వ్యాధి నియంత్రణ అధికారి యశ్వంత్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధిగ్రస్తులకు ఇచ్చే మందులను పరిశీలించారు. వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షయ వ్యాధి ఉన్న వారు సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా పరీక్షలు చేయించుకొని మందులు తీసుకోవాలన్నారు. రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం రెడ్డిపాలెం సచివాలయంలో పెద్దవారికి వేసే టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయనవెంట జిల్లా క్షయ నివారణ అధికారి మురళీకృష్ణ, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేవునిమాన్యం కాలనీలో తల్లిపాల వారోత్సవాలు

రొంపిచర్ల, ఆగస్టు 1: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని అంగన్‌వాడీ వర్కర్లు గురువారం పేర్కొన్నారు. మండల కేంద్రమైన రొంపిచర్లలోని దేవుడుమాన్యం కాలనీలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు విజయలక్ష్మి, లక్ష్మి, నాగమల్లేశ్వరి, అంజమ్మ, విఘ్నేశ్వరి, కళావతి, కే విజయలక్ష్మి పాల్గొన్నారు.

తల్లిపాలతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం: శ్రీలత

కారుమంచి (శావల్యాపురం) ఆగస్టు 1: తల్లిపాలలో ఉండే పోషకాలతో పిల్లల్లో వ్యాధి నిరోధకశక్తి వృద్ధిచెంది సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుప్పం శ్రీలత అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కారుమంచి అంగనవాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, మహిళలకు తల్లిపాల ప్రాముఖ్యతపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు తిరుమలాదేవి, జ్యోతి, శ్రీదేవి, సామ్రాజ్యం, సీతామహాలక్ష్మి, హరిత తదితరులు పాల్గొన్నారు.

పేదవారికి సంక్షేమం కూటమి ప్రభుత్వ లక్ష్యం

● పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు


చిలకలూరి పేట నియోజకవర్గంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, తోట రాజా రమేష్

చిలకలూరిపేట అర్బన్, ఆగస్టు 1: పేద ప్రజలకు నిబద్ధతతో సంక్షేమం అందించమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. గురువారం ఉదయం పట్టణంలోని 11, 12, 19 వార్డుల్లో రూరల్ మండలంలోని వేలూరు, కుక్కపల్లివారిపాలెం, యడ్లపాడు మండలంలోని సందెపూడి, జాలాది, నాదెండ్ల మండలంలోని చందవరం, సాతులూరు గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాలలో ముఖ్య అతిథిగా ప్రత్తిపాటి పుల్లారావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట రాజారమేష్‌లు పాల్గొన్నారు. పట్టణంలో మూడు వార్డుల్లో, మండలాల పరిధిలో ఆరు గ్రామాల్లో 50మంది లబ్ధిదారులకు వారి గృహాల వద్దకు వెళ్ళి పింఛన్‌లను స్వయంగా ప్రత్తిపాటి, రాజా రమేషలు అందించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ ఈ నెలలో కూడా రూ 2,800 కోట్లు మొత్తాన్ని కేవలం ఒక్క రోజులో పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నారని, 96 శాతం లబ్దిదారులకు ఈ ఒక్క రోజులోనే పింఛన్లు పంపిణీ చేశామన్నారు. విభజన హామీలు మొత్తం అమలు పరచటానికి నిధులు కేటాయిస్తున్న విషయం వైసీపీ పత్రికకు, నేతలకు కన్పించకపోవటం బాధాకరమన్నారు. కార్యక్రమంలో జీడీసీటీ మాజీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి షేక్ కరిముల్లా, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు కామినేని సాయిబాబా, బండారుపల్లి సత్యనారాయణ, జువ్వాజి మదన్‌మోహన్, పఠాన్‌సమద్‌ఖాన్ పాల్గొన్నారు.


రొంపిచర్లలో పింఛను పంపిణీ చేస్తున్న కలెక్టర్ అరుణ్ బాబు

వారికి పింఛన్ మొత్తగా అందజేస్తున్నారు. చిలకలూరిపేట పట్టణంలో మొత్తం 11,191 ఉండగా 10,893 మందికి పింఛన్‌ల పంపిణీ జరిగింది. పట్టణంలో 97.34 శాతం మేరకు పింఛన్‌ల పంపిణీ జరిగింది. చిలకలూరిపేట రూరల్ మండలంలో మొత్తం 8,661 మంది పింఛన్ దారులకు గాను 8,498 మందికి పింఛన్‌ల పంపిణీ జరిగింది. రూ 3.62 కోట్లకు గాను రూ 3.56 కోట్ల మొత్తం పంపిణీ చేయటం జరిగింది. ఇక నాదెండ్ల మండలంలో 9,581 మందికి గాను 9,347 మందికి, యడ్లపాడు మండలంలో 8,020 మందికి గాను 7,725 మందికి పింఛన్‌ల పంపిణీ జరిగింది.

అవ్వాతాతల మొహాల్లో చిరునవ్వే కూటమి ప్రభుత్వానికి దీవెనలు: జీవీ

వినుకొండ టౌన్, ఆగస్టు 1: పింఛన్లు ఇంటివద్దనే అందుకున్న అవ్వాతాతల మొహాల్లో చిరునవ్వే కూటమి ప్రభుత్వానికి దీవెనలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. గురువారం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పట్టణంలోని సంజయ్‌గాంధీనగర్ ఉదయం ఆరుగంటలకే ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో ఉదయం ఆరుగుంటల నుంచి కేవలం రెండు గంటల్లోనే పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకులు నిశంకర శ్రీనివాసరావు, నాగశ్రీను రాయల్, బీజేపీ నాయకులు మేడం రమేష్, టీడీపీ నాయకులు ఆయూబ్‌ఖాన్, జానీభాష, కౌన్సిలర్లు వాసిరెడ్డి లింగమూర్తి, పీవీ సురేష్‌బాబు, పత్తి పూర్ణచంద్రరావు, మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, పార్టీ నాయకుల, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఈపూరులో సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

● ఈపూరు: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా కృషి చేస్తామని ఎమ్మెలే జీవీ ఆంజనేయులు అన్నారు. ఎన్టీఆర్ భరోసా పథకం పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి మండల కేంద్రమైన ఈపూరులో గురువారం ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా కూడలిలోని ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళిలర్పించారు. మండలంలో 6480 పింఛన్లుకు గాను 98 శాతం పంపిణీ పూర్తి చేశామని ఎంపీడీవో ఏవీ రంగనాయకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకులు నిశ్శంకరరావు శ్రీనివాసరావు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, మాజీ ఎంపీపీ బొల్లా వెంకట కోటయ్య, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమల శెట్టి బాలయ్య, ఐనాల కోటేశ్వరరావు, విడపలపాటి హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ళలో రాష్ట్రం అతలాకుతలం: ప్రత్తిపాటి

యడ్లపాడు, ఆగస్టు 1: వైసీపీ నాయకుడు గత ఐదేళ్ళలో తన అరాచక పాలనతో రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిపోయాడని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. గురువారం మండలంలోని సందెపూడి, జాలాది గ్రామాల్లో జరిగిన ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ప్రత్తిపాటి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప


విప్పర్లపల్లిలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు

ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు ఎంతో కష్టపడాల్సి వస్తోందని లేకుంటే పరిపాలన గాడిన పడేలా లేదన్నారు. కలెక్టర్లు, ఎస్పీలను మార్చడానికే రెండు నెలలు పట్టిందన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్, మాజీ జీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కుర్రా రత్తయ్య మండల టీడీపీ అధ్యక్షుడు కామినేని సాయిబాబు, మాజీ ఎంపీపీ కందిమళ్ళ రఘురామారావు, సర్పంచ్‌లు కూరాకుల బాబు, మద్దినీడి రామకృష్ణ, టీడీపీ నాయకులు మద్దినేని సుబ్బారావు, మద్దూరి వీరారెడ్డి, శ్రీనివాసరెడ్డి, పిన్నింటి శ్రీమన్నారాయణ, ముద్దన నాగేశ్వరరావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులే లక్ష్యం: ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 1: పేదల జీవితాలలో వెలుగులే లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. గురువారం పట్టణంలోని 11, 32, 33, 34 వార్డులలో ఇంటింటికి వెళ్ళి పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ జగన్‌రెడ్డి పెన్షన్లు పంపిణీ పేరుతో లబ్దిదారుల జీవితాలలో చెలగాటం ఆడి, రాజకీయం చేస్తే, చంద్రబాబు నాయుడు వారి జీవితాలలో వెలుగులు నింపేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఒకటో తేదినే దాదావు 90 శాతం పెన్షన్లు పంపిణీ చంద్రబాబునాయుడు దర్శనికతకు, విజన్‌కు నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో అధికారులు, సచివాలయం సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● రొంపిచర్ల, ఆగస్టు 1: మండలంలోని గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మండల కేంద్రమైన రొంపిచర్లలో కలెక్టర్ అరుణ్‌బాబు, విప్పర్లపల్లిలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, రొంపిచర్లలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు పింఛన్లను పంపిణీ చేశారు.

నియోజక వర్గంలో 97.4 శాతం పింఛన్‌ల పంపిణీ

చిలకలూరిపేట, ఆగస్టు 1: చిలకలరిపేట నియోజకవర్గ పరిధిలో గురువారం సాయంత్రం 6గంటల సమయానికి 97.4 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయింది. నియోజకవర్గంలో మొత్తం పింఛన్ దారులు 37,453 మంది పింఛన్ దారులు ఉండగా వారిలో 36,463 మందికి పింఛన్‌ల పంపిణీ జరిగింది. నియోజకవర్గంలో మొత్తం 15.58 కోట్ల రూపాయలు వివిధ వర్గాల



పీఎం నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబు నాయుడు, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సుప్రీం తీర్పుపై ఎమ్మార్పీఎస్ నేతల హర్షం

వినుకొండ టౌన్, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై వినుకొండ ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, ఎంఎస్ఎఫ్, ఆధ్వర్యంలో గురువారం హర్షం వ్యక్తం చేశారు. వివిధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సీఎం నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణ మాదిగ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో రాజశేకర్ అప్పారావు, మందా వెంకట్రావు, ఆశీర్వాదం, దాసరి చిన్న కోటేశ్వరరావు , నేలపట్ల శ్యామ్ ప్రసాద్, రావినూతల ఆశీర్వాదం పాటు పలువురు మాదిగ సోదరులుపాల్గొన్నారు.

● చిలకలూరిపేట: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అడపా మోహన్ మాదిగ గురువారం హర్షం వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు తీర్పును ఆయన స్వాగతించారు. లక్షల మంది మాదిగలతో పాటు 59మంది ఉప కులాలకు ఈ తీర్పు ద్వారా మేలు జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలని సూచించారు.

1995లో వర్గీకరణతో 22 వేల మందికి లబ్ధి

నరసరావుపేట టౌన్, ఆగస్టు 1: చంద్రబాబునాయుడు 1995లో వర్గీకరణ చేస్తేమాదిగ, ఉపకులాలు 22వేల మంది లబ్ధి పొంది ఉద్యోగాలు సాధించారని మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి పల్నాడు జిల్లా అధ్యక్షుడు చింతిరాల మీరయ్య అన్నారు. పట్టణంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అలాంటి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన సమయంలో సుప్రీం కోర్టు తీర్పురావడం హర్షనీయమన్నారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేస్తారనే నమ్మకం రాష్ట్రప్రభుత్వంపై ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ఎస్ నాయకులు ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు కొమ్ము రూబేను, ఎంఆర్‌పీఎస్ఎస్ నాయకులు సీహెచ్ కోటి, రావినూతల దేవదానం, తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పుపై ఎంఆర్‌పీఎస్ నియోజవర్గ ఇన్‌చార్జి చిరుగురి నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. గురువారం నరసరావుపేటలో మాదిగల చైతన్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చిరుగురి నాగరాజు మాట్లాడుతూ న్యాయమైన హక్కు సాధనకు రాజీలేని పోరాటం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో జరిగిందన్నారు. సమావేశంలో ఎంఆర్‌పీఎస్ టౌన్ కన్వీనర్ ఆనంద్ మాదిగ, రవితేజ, నవీన్, బాలరాజు, ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కర్లకుంటలో పశు వైద్య శిబిరం

రొంపిచర్ల, ఆగస్టు 1: మండలంలోని కర్లకుంట పశు వైద్యశాలలో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు వైద్యాధికారి ఆవుల సాయి మహేష్‌రెడ్డి గురువారం తెలిపారు. సూడి పరీక్షలు, గర్భకోశ వ్యాధులు నిర్ధారణ, చికిత్స దూడలకు నట్టల నివారణ మందులు ఉచితంగా అందిస్తామని తెలిపారు.

వర్గీకరణ తీర్పుపై మాల మహానాడు నిరసన


నరసరావుపేట టౌన్, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా మాలమహానాడు ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్, తుళ్ళూరు శివయ్య, బోరుగడ్డ అంబేద్కర్, అంకం కరుణాకర్, గోదాబాల, కోండ్రు విజయ్, రాయిని చిన్న, రాయపూడి కోటి స్వామి, కీర్తిపాటి వెంకటేశ్వర్లు, కొమ్మతోటి కృప తదితరులు పాల్గొన్నారు.


న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొన్న జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎం మహతి

ఐనవోలులో న్యాయ విజ్ఞాన సదస్సు


నూజెండ్ల, ఆగస్టు 1: మండలంలోని ఐనవోలులో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వినుకొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎం మహతి మాట్లాడుతూ సివిల్ తగాదాలు పరిష్కారానికి కోర్టు సమయం 11 గంటల నుంచి 1 గంట సమయంలో తెలియజేస్తే న్యాయవాదులు పరిష్కారమార్గం చూపిస్తారన్నారు. ఈ సందర్భంగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీరభద్రాచారి, న్యాయవాదులు ఎంఎస్‌వీ నాయుడు, పఠాన్ గౌస్ మొహిద్దీన్ ఖాన్, వీ అమరబాబు, వీ శివశంకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పట్టణ సీఐగా ఎంవీ చరణ్ బాధ్యతల స్వీకారం



నరసరావుపేట లీగల్, ఆగస్టు 1: మొదటి పట్టణ సీఐగా ఎంవీ చరణ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు ఇప్పటివరకు ఆయన పల్నాడు జిల్లా సోషల్ మీడియా సైబర్ క్రైమ్ సెల్ లో సీఐగా సేవలందించారు. ఆగస్టు 31న జరిగిన బదిలీల్లో ఆయన నరసరావుపేట మొదటి పట్టణానికి వచ్చారు.

వినుకొండ తహసీల్దార్‌గా సురేష్ నాయక్


సురేష్ నాయక్

వినుకొండ, ఆగస్టు 1: వినుకొండ మండల తహసీల్దార్‌గా ఎస్.సురేష్‌నాయక్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన శావల్యాపురం మండలం జూనియర్ అసిస్టెంట్‌గా, ఆర్ఐగా, సత్తెనపల్లి, రెంటచింతల, మండలాల్లో తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. బాధ్యతలు స్వీకరించిన సురేష్‌నాయక్‌ను కార్యాలయ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

యడ్లపాడు తహసీల్దార్‌గా వెంకటరమణ

యడ్లపాడు, ఆగస్టు 1: యడ్లపాడు మండల తహసీల్దార్‌గా ఎ వెంకటరమణను నియమితులయ్యారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు బుధవారం సాయంత్రం ఉత్తర్వులు వెలువరించారు. గురువారం మధ్యాహ్నం వెంకటరమణ యడ్లపాడు తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల ముందు నాదెండ్ల తహసీల్దార్‌గా పని చేసిన ఈమె ఎన్నికల బదిలీల్లో భాగంగా ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. ఎన్నికల అనంతరం తిరిగి జిల్లాకు వచ్చిన ఆమెను యడ్లపాడుకు బదిలీ చేశారు.


ప్రత్తిపాటిని కలసిన మూడు మండలాల తహసీల్దార్లు

ప్రభుత్వ ప్రతిష్టను పెంచేలా పనిచేయాలి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఆగస్టు 1: కొత్తగా బాధ్యతలు స్వీకరించిన చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాల తహసీల్దార్లు షేక్ మహమ్మద్ హుస్సేన్, జీ విజయశ్రీ, ఏవీ రమణలు మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును గురువారం కలిశారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటికి బొకేలు అందజేశారు. వారితో ప్రత్తిపాటి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రతిష్ఠ పెంచేలా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండలాల అధ్యక్షుడు జువ్వాజి మదన్‌మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయి బాబులు పాల్గొన్నారు.


తహసీల్దార్ విజయశ్రీకి శుభాకాంక్షలు తెలుపుతున్న కార్యాలయ ఉద్యోగులు

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ విజయశ్రీ

నాదెండ్ల, ఆగస్టు 1: నాదెండ్ల మండల తహసీల్దార్‌గా జెట్టి విజయశ్రీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆమె అమరావతి తహసీల్దార్‌గా పని చేస్తూ ఎన్నికల విధుల్లో భాగంగా మరో జిల్లాకు బదిలీపై వెళ్ళారు. బాధ్యతలు స్వీకరించిన విజయశ్రీని డిప్యూటీ తహసీల్దార్ అనురాధ, ఆర్ఐ రమీజా, కార్యాలయ సిబ్బంది, పలువురు వీఆర్‌వోలు కలసి శుభాకాంక్షలు తెలిపారు.


శావల్యాపురంలో సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

● ఎస్పీ కంచి శ్రీనివాసరావు

శావల్యాపురం, ఆగస్టు 1: పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులు పెండింగ్ లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సిబ్బందిని ఆదేశించారు. శావల్యాపురం పోలీస్‌స్టేషన్‌ను గురువారంరాత్రి ఆయన సందర్శించారు. పోలీస్‌స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలల వద్ద విజిబుల్ పోలీసింగ్‌ను ఏర్పాటు చేయాలని, మహిళలు, బాలికలపై ఎటువంటి అన్యాయాలు, అత్యాచారాలకు తావులేకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా నిరంతరం పర్యవేక్షణ చేయాలని, పోలీస్‌స్టేషన్‌కి వచ్చిన ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్‌రావు, ఎస్ఐ చల్లా సురేష్, రైటర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల, ఆగస్టు 1: మండల కేంద్రమైన రొంపిచర్ల పోలీసు స్టేషన్‌ను ఎస్పీ శ్రీనివాసరావు గురువారం తనిఖీచేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌లోని రికార్డుల నిర్వహణ, కేసుల పురోగతి గురించి ఎస్ఐ రవీంద్రను అడిగి తెలుసుకున్నారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

వలస కార్మికుడి ఆత్మహత్య


మాధవ్‌స్వైన్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎస్ఐ బాలకృష్ణ

యడ్లపాడు, ఆగస్టు 1: వలస కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని తిమ్మాపురంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రం గంజాంజిల్లా పాతంపూర్ గ్రామానికి చెందిన సీలా మాధవ్‌స్వైన్(36) ఉపాధి నిమిత్తం మండలంలోని తిమ్మాపురంనకు కుటుంబంతో వలస వచ్చాడు. గ్రామంలోని ఓ నూలుమిల్లులో భార్యాభర్తలు కార్మికులుగా చేరి మిల్లు క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. గత నెల 13న భార్యా పిల్లలతో స్వగ్రామమైన పాతంపూర్‌కు వెళ్ళాడు. గ్రామంలో నివాసం ఉంటున్న చెల్లెలి భర్తతో ఆర్థికలావాదేవీల విషయంలో ఘర్షణ జరిగి, విషయం భార్యకు చెప్పకుండా తిమ్మాపురం బయలుదేరాడు. విజయవాడ చేరుకున్న తరువాత ఒరిస్సాలో ఉన్న భార్యకు ఫోన్‌చేసి నేను మిల్లువద్దకు వెళుతున్నానని తెలిపాడు. అనంతరం మిల్లు క్వార్టర్‌కు చేరుకుని, మిల్లులో పనిచేసే సూర్యనారాయణగౌడతో కలసి గణపవరం వెళ్ళి మద్యం తాగాడు. మద్యం తాగే సమయంలో స్వైన్ తన బావతో జరిగిన ఘర్షణ గురించి గౌడకు తెలిపి తాను చనిపోతానంటూ చెప్పాడు. అనంతరం తిరిగి మిల్లు క్వార్టర్స్‌కు చేరుకుని నిద్రించారు. గురువారం తెల్లవారు జామున గౌడ విధులకు వెళుతూ స్వైన్ క్వార్టర్ వచ్చి లోపలికి వెళ్ళి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని వేళాడుతూ కనిపించాడు. విషయాన్ని మిల్లు యాజమాన్యానికి తెలపడంతో వారు యడ్లపాడు పోలీసులకు, కుటుంబ సభ్యులకు తెలిపారు. సమాచారం అందుకున్న యడ్లపాడు ఇన్‌చార్జ్ ఎస్ఐ బాలకృష్ణ సిబ్బందితో కలసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. భార్య ఫైన్ స్వైన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉప్పరపాలెం రేషన్ డీలర్ మృతి


కూరాకుల అనీల్ కుమార్ (ఫైల్‌ఫొటో)

ఈపూరు, ఆగస్టు 1: మండలంలోని ఉప్పరపాలెం రేషన్‌షాపు డీలర్ కూరాకుల అనీల్ కుమార్ (26) గుండెపోటుతో మృతిచెందాడు. మృతదేహాన్ని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకుడు నిశ్శంకరరావు శ్రీనివాసరావులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. కొచ్చెర్ల ఎస్సీ కాలనీలో మృతిచెందిన టీడీపీ నాయకుడు పల్లెపోగు చినఏసు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. జనసేన నాయకుడు వీరరాఘవులు కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరు మృతి


మృతిచెందిన కోటయ్య

శావల్యాపురం, ఆగస్టు 1: రోడ్డుపై వెళుతున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన గుంటూరు- కర్నూలు జాతీయరహదారి మార్గంలో కనమర్లపూడి సమీపాన పెదకంచెర్ల కాలువ వద్ద గురువారం జరిగింది. ఎస్ఐ చల్లా సురేష్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని గంటవారిపాలెం గ్రామానికి చెందిన తెల్లమేకల కోటయ్య (39) లారీడ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం గురువారం ఉదయం గంటవారిపాలెం నుంచి వినుకొండకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. కనమర్లపూడి గ్రామ సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి పెదకంచెర్ల కాలువపై బ్రిడ్జిగోడను ఢీకొని రోడ్డు పక్కన పడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ సురేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి ఇద్దరు సంతానం ఉన్నారు. మృతుని భార్య ఆదెమ్మ ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.